

సాధకుడు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. సాధన దృఢపడినప్పుడు, లక్ష్యం అవసరం లేదు, అప్పుడు శరణాగతి పొందాలి. మొదటిది, ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, కర్మ యోగం ద్వారా మీ గమ్యాన్ని చేరుకోవడం. రెండవది, భక్తితో మిమ్మల్ని మీరు పూర్తిగా సమర్పించుకోవడం; "ప్రభూ, దయచేసి నీ ఇష్టానుసారం నన్ను నడిపించు" - ఇదే భక్తి. ఒకటి మరొకదానిలో ఇమిడి ఉంటుంది. భక్తిలో కర్మ యోగం ఉంటుంది, కర్మ యోగంలో భక్తి ఉంటుంది. మీరు శరణాగతి పొందినప్పుడు మాత్రమే సరైన మార్గాన్ని చూడగలరు. మీరు సరైన మార్గంలో నడిచినప్పుడు, మీ మనస్సు దానంతట అదే వంగడం మొదలవుతుంది, శరణాగతి జరగడం ప్రారంభమవుతుంది.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ

www.prajadeevena.com

ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 365 | శుక్రవారం | 6 నవంబర్ 2026 | పేజీలు : 04 వెల ₹ 5

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యేకచర్చ

ఈ నెలలోనే రెండు రోజుల పాటు సమావేశాలు పెట్టి చర్చిద్దాం

ప్రతిపక్షం దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

మూడు బ్యారేజీల పరిస్థితి చెబుదాం

వాటి మరమ్మతు చర్యలను వివరిద్దాం

మూడేళ్లు ఎందుకు పట్టిందో కూడా చెప్పాలి

మంత్రులు గోదారి ప్రాజెక్టులు సందర్శించాలి

నీరు వృథా కావట్లేదని ప్రజలకు వివరించాలి

మంత్రులతో సమావేశంలో సీఎం రేవంత్

రూ.4193 కోట్లతో 3 బ్యారేజీల పునరుద్ధరణ

వచ్చే నెలలో మరమ్మతు పనులు ప్రారంభం

మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం

ప్రజా దీవెన, హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు, బ్యారేజీల మరమ్మతులపై ఈ నెలాఖరులోగా అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచి సమగ్రంగా చర్చిద్దామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులతో అన్నారు. గోదావరి నీళ్లను కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా ఎత్తిపోయకుండా ఆంధ్రాకు వదిలేస్తున్నారంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని అసెంబ్లీ వేదికగానే తిప్పికొట్టాలని

మిగతా 2 లో



సమ్మిట్‌కు సన్నాహాలు

సమ్మిట్‌కు అంతర్జాతీయ స్థాయి ఏర్పాట్లు

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

డిసెంబరు 7-9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ -2026

04

ట్రంప్‌కు పదవీగండం

అధ్యక్ష పదవి నుంచి తొలగించే తీర్మానంపై డెమోక్రాట్ల కసరత్తు

ట్రంప్, ఆయన కుటుంబ సభ్యుల ఆర్థిక లావాదేవీలపైనా దృష్టి

అధికారం అండతో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు

హెగ్సెత్‌ను తొలగించేందుకు చర్యలు చేపడతాం: డెమొక్రాట్లు

అభిశంసనకు ప్రయత్నిస్తే నాశనమే!.. ట్రంప్ హెచ్చరిక

మధ్యంతర ఎన్నికల్లో పరాభవం ఎదుర్కొన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు.. మరో సవాలు ముందుకొచ్చింది. అమెరికా చట్టసభల్లో పూర్తి మెజారిటీ సాధించిన డెమొక్రాట్లు.. ట్రంప్‌పై అభిశంసన చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ట్రంప్, ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డారని, భారీగా లబ్ధిపొందారన్న ఆరోపణలపై సమగ్ర విచారణలకు సిద్ధమవుతున్నారు.



04



విదేశీ టూర్ వివరాలు చెప్పాలి

చర్చకు సిద్ధమైతే మోడీకి లేఖ రాయాలి

గత లోక్‌సభ ఎన్నికలలో సర్ లేకున్నా ఓడిపోయారు.

పార్లమెంట్లో అడ్డుకుంటూ.. వీధుల్లో ఆందోళనలా?

మీ విదేశీ పర్యటనల వివరాలు ప్రజలకు వెల్లడించాలి

రాహుల్ గాంధీకి అమిత్ షా సవాల్

ప్రధానమంత్రి సరేంద్ర మోడీతో బహి రంగ చర్చకు రావాలంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడు రాహుల్ గాంధీ చేసిన సవాల్పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. వీధుల్లో కాకుండా పార్లమెంట్ లో చర్చకు రావాలని ఆయన ప్రతి సవాల్ విసిరా రు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై చర్చించేందుకు అవసరమైతే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

వివరాలు 4 లో

జలవనరుల సంరక్షణకు సమాయత్తం

2027 జనవరి నుంచి జూన్ దాకా కార్యక్రమం: ఉత్తమ్



02

ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడనున్న దృష్ట్యా రాష్ట్రంలో జలవనరుల పునరుద్ధరణకు వివిధ కార్యక్రమాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 జనవరి నుంచి జూన్ దాకా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తూ ఆర్నెల్లపాటు జలవనరుల పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు.



03

ఆర్ఆర్ టాక్స్‌పై ఆరోపణలేనా?

బిల్డర్ల నుంచి అడుగుకు 200 వసూలు వాస్తవం: కేటీఆర్

హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా... ఆర్ఆర్ ట్యాక్స్ పేర రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ రూ.వేల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించడమే తప్ప చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.



వారిద్దరి వైఫల్యాలపై వార్ ప్రకటిస్తాం

థర్డ్ ఫ్రంట్ అంటూ ఆయన కలిసినవారంతా ఓడిపోయారు

కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ఎండగడతాం

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్

తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా చెప్పుకొంటున్న పార్టీ అధినేత (కేసీఆర్) రాజకీయంగా ఐరన్ లెగ్‌గా మారారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్ ఎద్దేవా చేశారు.

03

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యేకచర్చ

మొదటి పేజీ తరువాయి

పిలుపునిచ్చారు. గురువారం క్యాబినెట్ భేటీకి ముందు మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన సీఎం.. రెండు రోజుల పాటు సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కాళేశ్వరం బ్యారేజీలపై సమీక్షించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు రూ.4193 కోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. డిసెంబరులో మరమ్మతులు ప్రారంభించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అనంతరం జరిగిన క్యాబినెట్ భేటీలోనూ ఈ అంశంపై చర్చించారు. ఎన్‌డీఎస్‌ఏ చెప్పినట్లు ప్రాజెక్టుకు అన్ని రిపేర్లు పూర్తి చేసి, వినియోగంలోకి తేవాలని క్యాబినెట్ నిర్ణయించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సభలో చర్చిద్దామని మంత్రులతో సీఎం అన్నారు. మూడు బ్యారేజీల పరిస్థితి ఏంటి? వాటిలో నీటిని నిల్వ చేస్తే తట్టుకునే పరిస్థితి ఉందా? ఎన్‌డీఎస్‌ఏ ఏం నివేదికలు ఇచ్చింది? మరమ్మతులకు ప్రభుత్వం ఏం చర్యలు తీసుకోనుంది? అసలు మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇందుకు మూడేళ్ల సమయం ఎందుకు పట్టింది? దేవాదుల, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా గత ప్రభుత్వాల కంటే సమర్థవంతంగా నీటిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నాం? ఈ వివరాలన్నీ సభలో చర్చిద్దామని చెప్పారు. ఈ అంశాలపై బీఆర్ఎస్ నేతలకూ మాట్లాడే అవకాశం ఇద్దామన్నారు. బీఆర్ఎస్ నేతలు, ఆ పార్టీ సోషల్ మీడియా చేస్తున్న దుష్ప్రచారానికి అసెంబ్లీ వేదికగా ప్రజలకు సమాధానం ఇవ్వాలని ముఖ్యమంత్రి చెప్పారు. మరమ్మతులు చేయకుండా మూడు బ్యారేజీల్లో నీళ్లు నిల్వ చేసే పరిస్థితి లేదని, అవి పని చేయకుండా కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసే పరిస్థితి కూడా లేదని సీఎం మంత్రులకు వివరించారు. ఇది తెలిసి కూడా బీఆర్ఎస్ నాయకత్వం దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. వాస్తవాన్ని రైతులు, ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు ఆ రెండు ఎత్తిపోతల ప్రాజెక్టులను సందర్శించాలని ఆదేశించారు. కాళేశ్వరానికి గుండెకాయ లాంటి మూడు బ్యారేజీలు పని చేయకున్నా గోదావరి నీటిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నామో ప్రజలకు చూపించాలని చెప్పారు. సందర్శనకు స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులనూ తీసుకెళ్లాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క ఈ ప్రాజెక్టులను సందర్శించనున్నారు.



లోపాల సవరణ బాధ్యత నిర్మాణ సంస్థలదే

నిర్మాణపరమైన లోపాలను ఎల్ అండ్ టీ(మేడిగడ్డ), అఫ్కాన్స్(అన్నారం), నవయుగ(సుందిళ్ల) సంస్థలే సరి చేయాల్సి ఉంటుందని, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించాలని సమీక్షలో నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనల ప్రకారం పునరుద్ధరణ పనులు చేపట్టి, దెబ్బతిన్న బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తేవాలని సీఎం నిర్దేశించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

ప్రస్తుత పరిస్థితుల్లో లిఫ్ట్ సాధ్యం కాదు

బ్యారేజీలు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కన్నెపల్లి(ప్రాణహిత) వద్ద కనిపించే నీటిని లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని నీటి పారుదల శాఖ ఇంజనీర్లు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు మూయాల్సి ఉంటుందని అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణ లోపాలున్న ఈ రెండు బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని(ఫ్రీ ఫ్లో) జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నీళ్లున్నా లిఫ్ట్ చేయడం లేదన్న తప్పుడు ప్రచారాన్ని ఈ సమాచారంతో తిప్పికొట్టాలని సీఎం మంత్రులకు సూచించారు. మేడిగడ్డ దెబ్బతిన్న తర్వాత మూడు బ్యారేజీల పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేయించినట్లు అధికారులు నివేదించారు. జాతీయ స్థాయి నిపుణులు, కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థల సహకారంతో అవసరమైన పరిశోధనలు పూర్తి చేసినట్లు తెలిపారు. పునరుద్ధరణకు సంబంధించిన ప్రాథమిక ప్రణాళికలకు కేంద్రం ఏర్పాటు చేసిన టెక్నికల్ ఓవర్ సైట్ కమిటీ ఇప్పటికే సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని వివరించారు.

గతంలో కన్నా మెరుగ్గా పంపింగ్

దిగువ గోదావరి నీరు వృథాగా పోకుండా జే చొక్కారావు దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని లిఫ్ట్ చేసినట్లు సీఎం చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీలు ఎత్తిపోస్తే.. ఈ మూడేళ్లలో సగటున 18.13 టీఎంసీలు పంపింగ్ చేశామన్నారు. గతంతో పోలిస్తే ఇది 89 శాతం అధికమని తెలిపారు. అక్టోబరు నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు.. మొత్తం 24.81 టీఎంసీలు లిఫ్ట్ చేసి వినియోగించుకున్నామని చెప్పారు. ఆ నీటితో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగు, తాగునీరు అందించామన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, వరి దిగుబడిలో దేశంలోనే రికార్డు సాధించామని సీఎం గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి ఉంటే కరువు పరిస్థితుల్లోనూ ఇబ్బందులు ఉండేవి కావని అన్నారు. ప్రాణహిత ప్రాజెక్టు తక్కువ ఖర్చుతో పూర్తయ్యేదని, కరెంట్ బిల్లుల భారం గణనీయంగా తగ్గేదని, ఎల్లంపల్లికి నీరు వచ్చేదని వివరించారు.

గత ప్రభుత్వ తప్పిదాల వల్లే కుంగుబాటు

గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే మేడిగడ్డ కుంగిపోయిందని సీఎం ఆరోపించారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనుల్లో వేగం పెంచాలని సూచించారు. భద్రత విషయంలో రాజీ పడకుండా జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

నెలాఖరులోగా తుది అనుమతులు

పునరుద్ధరణ పనులకు తుది అనుమతులను ఈ నెలాఖరులోగా పొందేందుకు ప్రయత్నించాలని సీఎం ఆదేశించారు. ఇందుకోసం కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ), ఎన్‌డీఎస్‌ఏతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. బ్యారేజీల నీటి వినియోగ సామర్థ్య పునరుద్ధరణ, రక్షణ పనులను రెండు దశలుగా విభజించుకోవాలని చెప్పారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, నిర్మాణ సంస్థల మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. సమీక్షలో నీటి పారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, టన్నెల్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరిక్షిత్ మెహ్రా తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రిపేర్లు

ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లోపాలు ఉన్నట్లు ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదికపై క్యాబినెట్ భేటీలో చర్చించారు. ఫౌండేషన్ లోపంతో పాటు కటాఫ్ వాల్స్ లోపం, డౌన్‌స్ట్రీమ్‌లో స్పిల్‌వేకు అవసరమైన వెడల్పు లేకపోవడం, అప్‌స్ట్రీమ్‌లో కటాఫ్ వాల్స్, డయాఫ్రం వాల్ ఏర్పాటు చేయకపోవడం వంటి లోపాలను ఎన్‌డీఎస్‌ఏ గుర్తించింది. ఈ లోపాల కారణంగా నీటిని నిల్వ చేయొద్దన్న ఎన్‌డీఎస్‌ఏ సిఫారసు మేరకు నిల్వ చేయలేదు. ఎన్‌డీఎస్‌ఏ చెప్పినట్లు పూర్తి వివరాలను సమర్పించి, ప్రాజెక్టును ఎలా వినియోగంలోకి తేవాలన్న దానిపై విధివిధానాలు రూపొందించాల్సి ఉంది. ఇప్పటికే పూర్తి వివరాలతో నివేదిక వచ్చింది. దీనిపై చర్చించిన క్యాబినెట్.. పారదర్శకంగా ప్రాజెక్టును రిపేర్ చేసి, ఉపయోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది.

ఆర్నెల్లపాటు 'జలవనరుల సంరక్షణ'

2027 జనవరి నుంచి జూన్ దాకా కార్యక్రమం: ఉత్తమ్

ప్రజా దీవెన, హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడనున్న దృష్ట్యా రాష్ట్రంలో జలవనరుల పునరుద్ధరణకు వివిధ కార్యక్రమాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 జనవరి నుంచి జూన్ దాకా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తూ ఆర్నెల్లపాటు జలవనరుల పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది జనవరి నుంచి జూన్ దాకా వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు నీటిపారుదలశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు కలిసి సంయుక్తంగా జలపునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో గ్రామస్థులను, ప్రధానంగా వ్యవసాయ కూలీలను భాగస్వాములు చేయాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో వల్ల ఉపాధి కోల్పోయే వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేలా పనులు చేపట్టాలని, చెరువుల్లో పూడికతీత, చెక్‌డ్యాంల నిర్మాణం, దెబ్బతిన్న తూములు, గేట్ల మరమ్మతులు వంటివి చేపట్టాలన్నారు. భూగర్భ జలాల పెరుగుదల కోసం చతుర్విద జలప్రక్రియ వంటి కార్యక్రమాలు అమలుపై అధ్యయనం చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

కంపెనీలపై విద్యుత్ సర్‌చార్జీలు ఓకే

డిస్కంలు వసూలు చేసుకోవచ్చు

ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి కరెంటు కొన్నా సర్‌చార్జి

చెల్లించాల్సిందే నాటి జీవోలతో మినహాయింపు లభించదు

స్పష్టం చేసిన హైకోర్టు.. పలు ప్రముఖ కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్ల కొట్టివేత

ప్రజా దీవెన, హైదరాబాద్ : సొంత వినియోగం కోసం ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి కరెంటు కొనుగోలు చేసినప్పటికీ.. డిస్కంలకు క్రాస్ సబ్సిడీ సర్‌చార్జి చెల్లించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్).. పలు ప్రైవేటు కంపెనీలకు జారీ చేసిన డిమాండ్ నోటీసులను సమర్థించింది. ఆ నోటీసులను సవాల్ చేస్తూ కంపెనీలు దాఖలు చేసిన దాదాపు 27 పిటిషన్లను కొట్టేసింది. దీంతో డిస్కంలు సర్‌చార్జీలను వసూలు చేసేందుకు మార్గం సుగమమైంది. సర్‌చార్జి చెల్లింపు నుంచి తమకు మినహాయింపు ఉందని, టీజీఎస్పీడీసీఎల్ జారీచేసిన నోటీసులు చెల్లవని పేర్కొంటూ మై హోం ఎస్టేట్స్, డాల్ఫిన్ హోటల్స్, గ్రీన్‌పార్క్ హోటల్స్, ఆర్ఎస్ బ్రదర్స్ రిటైల్ ఇండియా, మైహోం టైకూన్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, హోటల్ కమల్, యశోద హెల్త్‌కేర్ సర్వీసెస్, సాయిబోధ హోటల్స్, మహేశ్వరి ఆయిల్ ఇండస్ట్రీస్, టాటా టెలీసర్వీసెస్, శ్రీనివాస రిసార్ట్స్, ఎల్వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, యూనిమెడ్ హెల్త్ కేర్, అపోలో హాస్పిటల్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ తదితర కంపెనీలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. 'పిటిషనర్లు అయిన కంపెనీలకు విద్యుత్ అమ్ముకోవడానికి ఆయా ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు 1997, 1998లో జారీచేసిన 93, 112 జీవోల ద్వారా అప్పటి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాబట్టి, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జి వర్తించదు' అని పేర్కొన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. '93, 112 జీవోల ఉద్దేశం వేరు. వాటిని ఎలక్ట్రిసిటీ సప్లై యాక్ట్-1948 కింద ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ఇచ్చిన అంగీకారంగా భావించరాదు. పైగా, ఆ జీవోల చెల్లుబాటు కాలం మూడేళ్లు మాత్రమే. కాలం చెల్లిపోయిన జీవోల కింద క్రాస్ సబ్సిడీ సర్‌చార్జి మినహాయింపు వర్తిస్తుందని పిటిషనర్ కంపెనీలు భావించడం సరికాదు' అని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు విద్యుత్‌ను అమ్ముకోవడానికి అనుమతి కల్పించే ఉద్దేశంతోనే సదరు జీవోలను జారీ చేశారని, వాటి ఆధారంగా క్రాస్ సబ్సిడీ సర్‌చార్జి మినహాయింపును కోరలేరని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి కంపెనీలకు పన్ను మినహాయింపు ఇచ్చినప్పుడు మాత్రమే క్రాస్ సబ్సిడీ సర్‌చార్జి నుంచి మినహాయింపు లభిస్తుందని తెలిపింది. పిటిషనర్ కంపెనీల పిటిషన్లను డిస్మిస్ చేసింది.

నేడు 16 జిల్లాల్లో వర్షాలు

ప్రజా దీవెన, హైదరాబాద్ : రాష్ట్రంలో శుక్రవారం అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వెల్లడించింది. రాష్ట్రంలోని జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, యాదాద్రి-భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ-గద్వాల్, నారాయణపేట్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశముందని వివరించింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను ప్రకటించింది.

నాలుగేళ్లుగా మైనార్టీ స్కాలర్‌షిప్‌ల నిలిపివేత

కేంద్ర విధానాలతోనే పెరుగుతున్న డ్రాపవుట్లు: అసదుద్దీన్

ప్రజా దీవెన, హైదరాబాద్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగేళ్లుగా ముస్లిం విద్యార్థులకు అందించే ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్, మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్ పథకాలను నిలిపివేసిందని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. మజ్లిస్ చారిటీ తరపున గత 21 ఏళ్లుగా రూ.10.50కోట్ల విలువైన సహాయం చేశామని, ఈ ఏడాది రూ.86లక్షలను విద్యార్థులకు సహాయం రూపంలో అందించామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ముస్లిం విద్యార్థుల డ్రాపవుట్లు పెరుగుతున్నాయని, యూడైస్ లెక్కల ప్రకారం ప్రాథమిక స్థాయిలో 8 శాతంగా ఉన్న డ్రాపవుట్ల సంఖ్య, మాధ్యమిక స్థాయిలో 6, ఉన్నత విద్యలో 4 శాతంగా ఉందన్నారు. కాగా, ఉర్దూ మాధ్యమంలో పదో తరగతి చదువుతున్న 1700 మంది విద్యార్థుల పరీక్ష ఫీజును మజ్లిస్ చారిటీ తరపున ఆయన చెల్లించారు. గురువారం దారుసలాంలో ఫీజుల చెక్కును పాఠశాల ప్రధానోపాధ్యాయుల చేతికి అందించారు.

ఇళ్ల లబ్ధిదారులతో దీపావళి జరుపుకోండి!

పార్టీ నేతలకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సూచన

ప్రజా దీవెన, హైదరాబాద్ : దీపావళి పండుగను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి జరుపుకోవాలంటూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సూచించారు. ఇందిరమ్మ పేరుతో గతంలో ఎన్నడూ లేని విధంగా పేదలకు కొత్త ఇళ్లను ప్రభుత్వం ఇచ్చిందని, ఇది వారికి ఎంతో ఆనందాన్ని ఇచ్చే సందర్భమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పేదల కల నెరవేరిన నేపథ్యంలో వారితో దీపావళి పండుగను జరుపుకుని వారి ఆనందంలో భాగస్వాములు కావాలనిసూచించారు. గ్రామాల్లో రెండు దఫాలుగా ఇళ్లు మంజూరు చేశామని, హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. ఢిల్లీ వేదికగా వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లోకి ఎక్కిన మంత్రి దామోదర రాజనర్సింహా, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావులతో గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్‌తో జరగాల్సిన భేటీ వాయిదా పడింది. అనివార్య కారణాల వల్ల గాంధీభవన్‌కు తాము రాలేకపోతున్నట్లుగా దామోదర, లక్ష్మీకాంతరావు సమాచారం ఇవ్వడంతో ఈ భేటీని వాయిదా వేశారు.

సమ్మిట్‌కు సన్నాహాలు

సమ్మిట్‌కు అంతర్జాతీయ స్థాయి ఏర్పాట్లు

15 నాటికి ఏర్పాట్ల ప్రణాళిక సిద్ధమవ్వాలి

ప్రజా దీవెన, హైదరాబాద్ : రాష్ట్ర ప్రతిష్ఠను, పారిశ్రామిక విజన్‌ను ప్రపంచానికి చాటిచెప్పేలా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. భారత్ ఫ్యూచర్‌సిటీలో డిసెంబరు 7 నుంచి 9 వరకు 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్ల పురోగతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో గురువారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించిన పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళిక నవంబరు 15 నాటికి సిద్ధమవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సదస్సుకు విదేశీ ప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. భద్రతకు సంబంధించివిభాగానికో భద్రతాధికారిని కేటాయించాలని సూచించారు. వేదిక వద్ద ప్రవేశం నుంచి తిరుగు ప్రయాణం వరకు ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. కాగా, గత ఏడాది నిర్వహించిన తెలంగాణ రైజింగ్ సమ్మిట్ కంటే ఈసారి మరింత విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. గతంలో ఒక్క ఎక్స్‌పో హాల్ మాత్రమే ఉండగా.. ఈసారి ఏకంగా ఆరు భారీ ప్రదర్శనశాలలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మొత్తం 52 రంగాలపై 4 ప్రదాన హాళ్లలో ప్రత్యేక సమావేశాలు ఉంటాయని తెలిపారు. ఇందులో రక్షణ, ఏరోస్పేస్, రోబోటిక్స్ పరికరాలు, వైమానిక విన్యాసాలతో కూడిన రక్షా ఎక్స్ పో, గేమింగ్, యానిమేషన్ రంగాల సమాహారంగా 'ఇండియా జాయ్-2026, 136 వినూత్న ప్రదర్శనలతో స్టార్టప్ పెవిలియన్, 60 ప్రముఖ కంపెనీలతో ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్ పోలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయుల వైభవాన్ని చాటేలా తెలంగాణ పెవిలియన్, పర్యాటకరంగ ఆకర్షణలు, నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు విద్యావికాసాన్ని ప్రతిబింబించే ఎడ్యుకేషన్ ఎక్స్‌పోలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన సీఎం.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సారథ్యంలోని మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాట్లను నిరంతరం సమీక్షిస్తుందని అన్నారు. అలాగే, ఈసారి ప్రదర్శనల్లో రక్షాఎక్స్‌పో ప్రధాన ఆకర్షణ కానుందని సీఎం చెప్పారు. ఇప్పటివరకు 49 రక్షణ సంస్థలు ఇందులో భాగస్వామ్యమయ్యాయని సీఎం అన్నారు. అలాగే, ఎల్‌నినో ప్రభావం, కరువు, పరిస్థితులపై డిసెంబరు 8న నిర్వహించనున్న తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ ఏర్పాట్లపైనా అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.

కొడంగల్‌లో రేపటి నుంచి సీఎం పర్యటన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. శనివారం నుంచి మూడు రోజుల పాటు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రూ.9,053 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు పలు భవనాలను ఆయన ప్రారంభించనున్నారు. శనివారం (7వ తేదీ) ఉదయం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోలను సీఎం ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశమవుతారు. అక్కడి నుంచి కొడంగల్ చేరుకుని, రాత్రి అక్కడే బస చేస్తారు. ఆదివారం(8వ తేదీ) ఉదయం మళ్లీ హకీంపేట చేరుకుని స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. సీఎం జన్మదినం సందర్భంగా కొడంగల్‌లోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి వేడుకల్లో పాల్గొంటారు. సీఎం పర్యటన సందర్భంగా మొత్తం రూ.9,053 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, శిలాఫలకాల ఆవిష్కరణలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.5,060 కోట్లతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2, ఎస్‌డీఎఫ్ కింద రూ.1,410 కోట్లతో 223 బీటీ రోడ్లు, రూ.2,100 కోట్లతో మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం ఫేజ్-2 పనులు, రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూర్‌లో ఆధునిక బస్టాండ్‌లు, తిమ్మారెడ్డిపల్లిలో రూ.4.45 కోట్లతో గురులోక్ మసంద్ ప్రణభు మందిరం అభివృద్ధి, రూ.5.10 కోట్లతో కొడంగల్ నిరంజన మఠం అభివృద్ధి, రూ.20 కోట్లతో మద్దూర్‌లో ఎన్ఏసీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ.59.30 కోట్లతో అంతర్గత రోడ్ల నిర్మాణం, రూ.10 కోట్లతో హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో టూరిజం హోటల్, రూ.20కోట్లతో ఇంటిగ్రేటెడ్ డివిజన్ ఆఫీస్ కాంప్లెక్స్, రూ.123 కోట్లతో కొడంగల్ వ్యవసాయ కళాశాల భవనం, రూ.81కోట్లతో ఎకో పామ్ ఆయిల్ కంపెనీ నిర్మాణం తదితర పనులకు సీఎం శంకుస్థాపనలు చేయనున్నారు. అలాగే, రూ.46.08 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 10 ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నారు. భారీ రైతు బహిరంగ సభలో సీఎం పాల్గొని ప్రసంగిస్తారు.

ఆర్ఆర్ టాక్స్‌పై ఆరోపణలేనా?

బిల్డర్ల నుంచి అడుగుకు 200 వసూలు వాస్తవం: కేటీఆర్

ప్రజా దీవెన, హైదరాబాద్ : హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా... ఆర్ఆర్ ట్యాక్స్ పేర రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ రూ.వేల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించడమే తప్ప చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని బిల్డర్లు, డెవలపర్లు ఎవరిని అడిగినా ఆర్ఆర్ ట్యాక్స్ గురించి చెబుతున్నారని, అయినా మోదీ, అమిత్ షా ఈ వ్యవహారంపై చర్యలు చేపట్టకపోవడానికి కారణమేంటని నిలదీశారు. ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో బిల్డర్ల నుంచి అడుగుకు రూ.200వసూలు చేస్తున్నది వాస్తవమని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ విషయం రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. బీజేపీ నేతలది ఉత్త మాటలేనని, చేత లు ఉండవని ఎద్దేవా చేశారు.

అయ్యప్ప సొసైటీలో రేవంత్ కుటుంబం

నా భూములపై ఎటువంటి విచారణకైనా సిద్ధమే

రాష్ట్రానికి పైసా సాయం ప్రకటించని షా: కవిత

ప్రజా దీవెన, హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంపై తెలంగాణ రక్షణసేన (టీఆర్ఎస్) అధ్యక్షు రాలు సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ లోని అయ్యప్ప సొసైటీని చెరబట్టిన సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. భూగర్భ జలాలు లేని అయ్యప్ప సొసైటీ ప్రాంతంలో ఒక్క ఇటుక కూడా పేర్చొద్దని హైకోర్టు ఆదేశం ఉన్నా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అయ్యప్ప సొసైటీలోని గురుకుల ట్రస్టు భూముల్లో వచ్చిన 500-700 అక్రమ నిర్మాణాలకు సీఎం సోదరులే అనుమతులిప్పిస్తూ కమీషన్లు దండుకుంటున్నారని కవిత గురువారం టీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో చెప్పారు. మునిసిపల్‌శాఖ తన వద్ద పెట్టుకున్న సీఎం.. పెద్ద బిల్డర్లకు సహకరిస్తున్నారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అనుమతించిన 700 నిర్మాణాలకు చేస్తున్న నోటరీ రిజిస్ట్రేషన్లు చెల్లవని, ఎవరూ అయ్యప్ప సొసైటీలో ఇళ్లు కొనవద్దన్న కవిత.. ఈ ప్రాంతంలో సమగ్ర సర్వే చేసి అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవాలని డిమాం డ్ చేశారు. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ఉన్నా.. ప్రయోజనం లేకపోయిందని, 18 వేల అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తన వద్ద ఇంచు అసైన్డ్/ఇనాం భూములున్నా ప్రభుత్వానికే రాసిస్తానని చెప్పారు. తన భూములపై ఎటువంటి విచారణకైనా సిద్ధమేనన్నారు. ఇదిలా ఉంటే, రాష్ట్రంలో 320 మండలాల్లో కరువు ఉంటే, హైద రాబాద్ కొచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా పైసా సాయం ప్రకటించలేదని కవిత ఆరోపించారు.

మద్యం రవాణా స్కాం కేసు.. ఈడీ కస్టడీలో ఈశ్వర్

రెండ్రోజులు విచారించనున్న అధికారులు

రాజ్ కసిరెడ్డికి ఈయన అత్యంత సన్నిహితుడు

షెల్ కంపెనీలు, హవాలా ద్వారా ముడుపుల సొమ్ము మళ్లించినట్లు ఆరోపణలు

రవాణా సబ్ కాంట్రాక్టులు, నగదు లావాదేవీలపై ఈడీ ఆరా

ప్రజా దీవెన, హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్‌లో మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డికి అత్యంత సన్నిహితుడైన టి.ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తన కస్టడీలోకి తీసుకుంది. గురువారం చంచల్‌గూడ జైలు నుంచి హైదరాబాద్‌లోని తన కార్యాలయానికి తరలించింది. రెండ్రోజుల పాటు ఆయన్ను విచారించనుంది. మద్యం రవాణా స్కాంలో కిరణ్‌కుమార్‌రెడ్డి అత్యంత కీలకంగా వ్యవహరించినట్లు ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) దర్యాప్తులో తేలింది. ఈ కుంభకోణంలో ముడుపుల ద్వారా అక్రమంగా సంపాదించిన సొమ్మును షెల్ కంపెనీలకు, హవాలా మార్గాల్లో మళ్లించడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. మద్యం రవాణా సబ్ కాంట్రాక్టర్ల నుంచి డిపోకు రూ.5 లక్షల చొప్పున ముందస్తుగా వసూలు చేశారని.. ఈ విధంగా రూ.కోటి వసూలు చేశారని విచారణలో వెల్లడైంది. ఇలా వచ్చిన సొమ్ములో వాస్తవ రవాణా ఖర్చుల కంటే రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షలు అధికంగా బిల్లులు వేయించి, అదనపు మొత్తాన్ని నగదు రూపం లో తీసుకున్నారని.. ఈ పద్ధతి ద్వారా నెలకు రూ.50 లక్షలు ఈశ్వర్‌కు చేరినట్లు ఈడీ కోర్టులో వేసిన కస్టడీ పిటిషన్‌లో పేర్కొంది. అయితే రవాణా కుంభకోణంలో ప్రభుత్వానికి జరిగిన రూ.195.33 కోట్ల నష్టం ఒక కోణం మాత్రమేనని.. నేరుగా ఈశ్వర్‌కు చేరిన రూ.కోట్లు ఏ విధంగా ఏయే మార్గాల్లో మళ్లించారు.. అంతిమంగా డబ్బు ఎక్కడకు చేరిందో గుర్తించడానికి ఈడీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన విచారణ కీలకంగా మారింది.

పామాయిల్ రైతుల ప్రయోజనమే లక్ష్యం

కేంద్రం దిగుమతి సుంకాన్ని 44శాతానికి పెంచాలి: తుమ్మల

దేశీయ ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలను పరిరక్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. విదేశాల నుంచి చౌకగా దిగుమతి అవుతున్న క్రూడ్ పామాయిల్ వల్ల ఇక్కడి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, గతంలో 44శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని తిరిగి ఆ స్థాయికి పెంచాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని మరోసారి కోరారు. ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలపై తెలంగాణ ప్రభుత్వం వ్యక్తం చేసిన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఇటీవల లేఖ ద్వారా హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. క్రూడ్ పామాయిల్ దిగుమతి సుంకాన్ని కేంద్రం క్రమంగా తగ్గిస్తూ వచ్చిందని, ఈ ఏడాది సెప్టెంబరులో దానిని 11శాతానికి పడిపోయేలా చేసిందని మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులకు పలుమార్లు లేఖలు రాసి, స్వయంగా కలిసి రైతుల ఇబ్బందిని వివరించినట్లు గురువారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

బీసీ ఆత్మగౌరవ భవనాలకు 88 కోట్లు విడుదల

ఏడాదిలోగా నిర్మాణాలు పూర్తికావాలి: పొన్నం

రాష్ట్రంలోని 38 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం రూ.88.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ జీవోలు జారీ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా కుల సంఘాల ప్రతినిధులకు జీవో పత్రాలను అందజేశారు.ల ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు, ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశాల మేరకు ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలకు ఉన్న పరిపాలనా, సాంకేతిక అవరోధాలను హెచ్ఎండీఏ సహకారంతో పరిష్కరించామని తెలిపారు. లే అవుట్లను 'రెడీ టూ కన్‌స్ట్రక్షన్' విధానంలో సిద్ధం చేసినందున, కుల సంఘాలు ఆలస్యం చేయకుండా కార్తిక మాసంలోనే శంకుస్థాపనలు చేసుకుని పనులు ప్రారంభించాలని సూచించారు. ఏడాదిలోగా నిర్మాణాలు పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

వారిద్దరి వైఫల్యాలపై వార్ ప్రకటిస్తాం



థర్డ్ ఫ్రంట్ అంటూ ఆయన కలిసినవారంతా ఓడిపోయారు

కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ఎండగడతాం

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్

హైదరాబాద్, నవంబరు 5 : తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా చెప్పుకొంటున్న పార్టీ అధినేత (కేసీఆర్) రాజకీయంగా ఐరన్ లెగ్‌గా మారారని బీజేపీ జాతీయ ఉ పాధ్యక్షుడు రామ్ మాధవ్ ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానంటూ దేశమంతా తిరిగి ఎవరినైతే కలిశారో వారంతా ఓడిపోయారన్నారు. బెంగాల్‌లో మమతాబెనర్జీ, ఒడిశాలో నవీన్ పట్నాయక్, ఏపీలో జగన్ మోహన్‌రెడ్డి, చివరకు తెలంగాణలో కేసీఆర్ కూడా ప్రజల చేతిలో ఓటయ్యారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తిరుగులేని ప్రత్యామ్నాయం బీజేపీయేనని, కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, తప్పిదాలు, దుర్మార్గపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామన్నారు. ఒక వైపు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశ సమస్యలను వదిలేసి సగం కాలం అమెరికా, యూరోపలలో గడుపుతుంటే, మరో వైపు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి ఢిల్లీ పర్యటనలకే పరిమితం అయ్యారని విమర్శించారు.

బీజేపీయే ప్రత్యామ్నాయం: రాంచందర్‌రావు

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను వీడి యువత తమ పార్టీలో చేరుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. పాతబస్తీ నుంచి గురువారం పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారన్నారు.

అంతరిక్షానికి బేస్-1 నిచ్చెన

హైదరాబాద్‌లో మరో ప్రతిష్ఠాత్మక కేంద్రం ఏర్పాటు

కాస్మోసర్వ్ బేస్-1ను ప్రారంభించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు జితేంద్ర, దుద్దిళ్ల

ప్రజా దీవెన, హైదరాబాద్ : అంతరిక్ష రంగంలో హైదరాబాద్ మరో కీలక ముందడుగు వేసింది. అంతరిక్షంలో పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించడంతోపాటు, కక్ష్యలోనే ఉపగ్రహాలకు మరమ్మతులు చేసే సదవలందించేందుకు దేశంలోనే తొలి ప్రైవేట్ సమగ్ర అంతరిక్ష సవల కేంద్రం హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చింది. కాస్మోసర్వ్ స్పేస్ సంస్థ ఏర్పాటు చేసిన 'బేస్-1' కేంద్రాన్ని గురువారం కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వర్చువల్‌గా, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యక్షంగా ప్రారంభించారు. అంతరిక్షంలో వస్తువులను గుర్తించే స్పేస్ విజన్ ఎఫెక్ట్, మైక్రోగ్రావిటీ సిమ్యులేషన్ సదుపాయాలతో కూడిన ఈ కేంద్రం ప్రపంచంలోనే ఆరోది కావడం విశేషం. ఇందులో ఉ పగ్రహ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం, పరీక్షించడం, ప్రయోగాలు నిర్వహించడం వంటి కార్యకలాపాలు ఉంటాయి. బేస్-1 ప్రారంభం భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో కీలక మైలురాయి అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. అంతరిక్ష రోబోటిక్స్, ఉ పగ్రహాలను చేరుకోవడం, వాటి అనుసంధానం, మిషన్ కంట్రోల్ వంటి సదుపాయాలను ఒకేచోట అందించటం ద్వారా భారత అంతరిక్ష స్టార్టప్‌ల సామర్థ్యాలు పెరుగుతాయని చెప్పారు. ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన చిరంజీవి ఫణీంద్ర, ఆయన బృందానికి అభినందనలు తెలిపారు. అదేవిధంగా ప్రముఖ వ్యోమగాములు రాకేశ్ శర్మ, శుభాంశు శుక్లా వీడియో సందేశాల ద్వారా చిరంజీవి ఫణీంద్ర కు అభినందనలు తెలిపారు.

చౌకైన స్పేస్‌టెక్ హబ్‌గా హైదరాబాద్

అంతరిక్ష వ్యర్థాలను తొలగించేందుకు కాస్మోసర్వ్ లాంటి సంస్థలు ముందుకు రావడం గొప్ప పరిణామం అని మంత్రి శ్రీధర్‌బాబు కొనియాడారు. అంతరిక్ష ఆవిష్కరణల్లో హైదరాబాద్ దేశానికే దిశానిర్దేశం చేస్తోందన్నారు. నగరంలో ఇప్పటికే 30కి పైగా స్పేస్‌టెక్ కంపెనీలు ఉన్నాయని, వీటితో దేశంలోనే తొలి స్పేస్‌టెక్ యూనికార్న్‌తోపాటు త్వరలో యూనికార్న్ స్థాయికి చేరనున్న మరికొన్ని సంస్థలు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరో స్పేస్, రక్షణ రంగాలు, 52 జాతీయ పరిశోధనా ప్రయోగశాలలు, 15 లక్షల మంది ఇంజినీర్ల నైపుణ్యం, స్థానికంగా దాదాపు 90 శాతం విడిభాగాల అవసరాలను తీర్చగల సరఫరా వ్యవస్థ ఈ అభివృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత తక్కువ వ్యయంతో అంతరిక్ష సాంకేతికతను అందించే కేంద్రంగా హైదరాబాద్ ఎదుగుతోందన్నారు. ఈ రంగంలోని ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా స్పేస్ సిటీని ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని వెల్లడించారు. కాస్మోసర్వ్ స్పేస్ తన తొలి ఏడాదిలోనే పలు మైలురాళ్లను అధిగమించిందని సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో చిరంజీవి ఫణీంద్ర తెలిపారు. భారత రాకెట్ ద్వారా తొలి పేలోడ్‌ను అంతరిక్షంలోకి పంపడంతోపాటు, సీడ్ ఫండింగ్ సమీకరించామని చెప్పారు. గగన్‌యాన్, భారతీయ అంతరిక్ష కేంద్రం (బీఏఎస్), భవిష్యత్తులో ప్రయోగించే ఉపగ్రహాల కోసం అంతరిక్ష కక్ష్యలను వినియోగించుకునే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంలో బేస్-1 కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

ప్రభుత్వ విప్ వీరేశానికి తప్పిన ముప్పు

నాలుగు గంటల వ్యవధిలో రెండుసార్లు ప్రమాదం



కట్టంగూరు : ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి ఒకేరోజు రెండు ప్రమాదాల నుంచి ముప్పు తప్పింది. గురువారం ఆయన ప్రయాణిస్తున్న వాహనాలు నల్లగొండ, భువనగిరి జిల్లాల్లో ప్రమాదానికి గురి కాగా, వీరేశం సురక్షితంగా బయటపడ్డారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నాయనమ్మ మృతిచెందటంతో.. వేముల వీరేశం హాజరై ఆమెకు నివాళు లర్పించారు. అక్కడి నుంచి చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి వస్తుండగా.. కట్టంగూరు మండలం అయిటిపాములలోని చెర్వుఅన్నారం వద్ద వీరేశం ప్రయాణిస్తున్న వాహనాన్ని వెనుకనుంచి మరో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎమ్మెల్యేకు ఎలాంటి గాయాలు కాకపోవటంతో ఆయనతోపాటు ప్రయాణిస్తున్న అనుచరులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం మరో కారులో జనగామ జిల్లా బచ్చన్నపేటలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి ఆయన బయలుదేరారు. నాగిరెడ్డిపల్లి వద్ద వీరేశం ప్రయాణిస్తున్న కారును గుర్తుతెలియని లారీ పక్క నుంచి రాసుకుంటూ వెళ్లటంతో త్రుటిలో ప్రమాదం తప్పింది.

బేతుపల్లి చెరువు ఘటన సుఖాంతం

సురక్షితంగా ఒడ్డుకు చేరిన ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది..

అభినందించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి



సత్తుపల్లి, నవంబరు 5 : తీవ్ర ఉ త్కంఠకు దారితీసిన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్దచెరువు ఘటన సుఖాంతమైంది. అలుగు వరదల్లో చిక్కుకున్న మత్స్యకారులను కాపాడేందుకు వెళ్లి.. బోట్లు తిరగబడడంతో కొట్టుకుపోయిన 10 మంది ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, వారికి సాయంగా వెళ్లిన స్థానికుడిని ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు. వారందరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. సుమారు 12గంటల పాటు జరిగిన ఈ రెస్క్యూ ఆపరేషన్ గురువారం ఉదయం 5:30 గంటలకు ముగిసింది. బేతుపల్లి పెద్దచెరువు అలుగు పోస్తుండడంతో చేపలు బయటకు వెళ్లిపోకుండా వలలు అడ్డుగా పెట్టేందుకు బుధవారం సాయంత్రం 8మంది మత్స్యకారులు అక్కడికి వెళ్లి చిక్కుకుపోవడం, వారిని కాపాడేందుకు వెళ్లిన ఎస్‌డీఆర్ఎస్ సిబ్బంది వరదలో కొట్టుకుపోవడం తెలిసిందే. దీంతో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించి కొట్టుకుపోయిన వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు ఇతర బృందాలతో అలుగు వద్ద చిక్కుక్కున్న మత్స్యకారులందరినీ బయటకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి సమయానికి ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి చెందిన సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారా వారున్న లొకేషన్‌ను అధికారులు గుర్తించారు. అర్ధరాత్రి 2:30 గంటల సమయంలో ఐదుగురిని, తెల్లవారుజామున మరో ఐదుగురిని గుర్తించి కాపాడారు. మరో వ్యక్తిని కాపాడేందుకు సాంకేతికంగా సాధ్యం కాకపోవడంతో తాడు సాయంతో అతడిని ఒడ్డుకు చేర్చారు. మొత్తంగా ఉదయం 5:30 గంటలకు రెస్క్యూ ఆపరేషన్ ముగిసింది. రాత్రంతా చెట్లపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నామని ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది తెలిపారు. చెప్పారు. వారందరినీ వెంటనే సత్తుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాణాలకు తెగించి బాధితులను కాపాడిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. గురువారం ఉదయం వారు వేర్వేరుగా సంఘటనా స్థలాన్ని సందర్శించి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని సన్మానించారు. సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని పరామర్శించారు. బుధవారం రాత్రి మొత్తం క్షేత్ర స్థాయిలో ఉండి సహాయక, గాలింపు చర్యలను పర్యవేక్షించిన ఖమ్మం కలెక్టర్ దివాకర, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయిలను అభినందించారు.

విదేశీ టూర్ వివరాలు చెప్పాలి

చర్చకు సిద్ధమైతే మోడీకి లేఖ రాయాలి

గత లోక్‌సభ ఎన్నికలలో సర్ లేకున్నా ఓడిపోయారు.

పార్లమెంట్లో అడ్డుకుంటూ.. వీధుల్లో ఆందోళనలా?

మీ విదేశీ పర్యటనల వివరాలు ప్రజలకు వెల్లడించాలి

రాహుల్ గాంధీకి అమిత్ షా సవాల్



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో బహి రంగ చర్చకు రావాలంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడు రాహుల్ గాంధీ చేసిన సవాల్పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. వీధుల్లో కాకుం డా పార్లమెంట్ లో చర్చకు రావాలని ఆయన ప్రతి సవాల్ విసిరా రు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై చర్చించేందుకు అవసరమైతే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. హర్యానాలోని కర్నాల్ నిర్వహించిన ర్యాలీలో అమిత్ షా మాట్లాడుతూ.. చర్చకు సిద్ధంగా ఉంటే ప్రధాని మోడీకి లేఖ రాయాలని రాహుల్ గాంధీకి సూచించారు. సర్పై పార్లమెంట్లో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రధాని మోడీ బహిరంగ చర్చకు రావాలని నవంబరు 3న రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. దేశద్రోహులెవరు? విదేశీ శక్తులతో సంబంధా లూ ఎవరికి ఉన్నాయి? ఆ సంబంధాల స్వరూపం ఏమిటి? అనే అంశాలపై ఎక్కడైనా, ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధమని రాహుల్ గాంధీ ప్రకటించిన నేపథ్యంలో అమిత్ షా' ఈ వ్యాఖ్యలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్లపైనా అమిత్ షా విమర్శలు గుప్పించారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సర్ అమలులో లే "పోయినా కాంగ్రెస్ ఓటమి పాలైందని గుర్తుచేశారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లోనూ సర్ లేదని, అయినప్పటికీ కాంగ్రెస్ ఓడిపోయిందని అన్నాడు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగకుండా అడ్డుకుంటూ, బయట వీధుల్లో ఆందోళనలు నిర్వహించడం ద్వారా గందరగోళం సృష్టిస్తున్నారని ప్రతిపక్షంపై మండిపడ్డారు. పార్లమెంట్లో నిరసనలు, బహిస్కరణలకు బదులుగా ప్రజాస్వామ్యబద్ధంగా చర్చల్లో పాల్గొనాలని సూ చించారు.

అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే 24 గంటల గడువు

అరెస్టు చూపడంలో జాప్యంచేసినా లెక్క మారదు

ప్రయాణ సమయానికి మాత్రమే మినహాయింపు

రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలగొద్దు

సుప్రీం కోర్టు కీలక తీర్పు



న్యూఢిల్లీ: ఏదైనా కేసులో నిందితుడిని పోలీసులు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచడానికి ఉన్న 24 గంటల గడువు అనేది.. సదరు నిందితుడిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే మొదలవుతుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. నిందితుడిని అరెస్టు చేశామని అధికారికంగా ప్రకటించినప్పటి నుంచి 24 గంటల గడువు మొదలుకాదని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం అరెస్టుకు, అదుపులోకి తీసుకోవడానికి మధ్య ఎలాంటి కృత్రిమ వ్యత్యాసం లేదని వెల్లడించింది. అరెస్టుకు ముందు కాలాన్ని మినహాయించేందుకు పోలీసులు చేసే ఏ ప్రయత్నమైనా అది రాజ్యాంగానికి వ్యతిరేకమేనని పేర్కొంది. ఒకవేళ నిర్బంధం 24 గంటలకు మించి కొనసాగితే సదరు వ్యక్తిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుచకముందే కస్టడీ నుంచి విడుదల చేయాలని తెలిపింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్ల ధర్మాసనం ఈ మేరకు కీలక తీర్పునిచ్చింది. 'అధికారికంగా అరెస్టు చేసినప్పటి నుంచే 24 గంటల గడువు మొదలవుతుందనే అభిప్రాయం రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2), భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) సెక్షన్ 56కు వ్యతిరేకం' అని ధర్మాసనం పేర్కొంది. అరెస్టు జరిగిన ప్రదేశం నుంచి మేజిస్ట్రేట్ కోర్టుకు చేరుకునే ప్రయాణ సమయాన్ని మాత్రమే 24 గంటల గడువు నుంచి మినహాయించవచ్చునని తీర్పులో పేర్కొంది. అంతేకానీ, అధికారికంగా అరెస్టును ప్రకటించడానికి ముందు విచారణ, దర్యాప్తు, సోదాలు లేదా సీజ్ కోసం తీసుకున్న సమయాన్ని 24 గంటల గడువు నుంచి మినహాయించకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు 24 గంటల గడువు లెక్కింపునకు సంబంధించి ఆర్యమన్ పట్నాయక్ కేసులో ఒడిసా హైకోర్టు, కన్నన్ కేసు లో మద్రాసు హైకోర్టు, అరుణ్ కే థామస్ కేసులో కేరళ హైకోర్టుల ఉత్తర్వులను వ్యతిరేకించింది. ఒకవేళ అటువంటి నిర్బంధం 24 గంటలకు మించి కొనసాగితే సదరు వ్యక్తిని కస్టడీ నుంచి విడుదల చేయాలని సుప్రీం కోర్టు పేర్కొంది. మాదక ద్రవ్యాలకు సంబంధించిన ఓ కేసులో నలుగురు నిందితులకు త్రిపుర హైకోర్టు బెయిల్ నిరాకరించింది. దీనిపై ఆ నలుగురు సుప్రీం కోర్టులో అప్పీలు చేసుకున్నారు. ఈ అప్పీలుపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ తీర్పు ఇచ్చింది.

దీపావళి వేళ రాష్ట్రాలకు కేంద్రం గుడ్ న్యూస్..

న్యూఢిల్లీ: దీపావళి పండుగ వేళ రాష్ట్రాలకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. పన్నుల పంపిణీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రాలకు నవంబర్ నెలకు సంబంధించిన పన్నుల వాటా కింద రూ. 1,09,019 కోట్లను విడుదల చేసింది. వాస్తవానికి ఈ నిధులను నవంబర్ 10న విడుదల చేయాల్సి ఉండగా.. ఐదు రోజుల ముందుగానే అంటే నవంబర్ 5న రాష్ట్రాల ఖాతాల్లో జమ చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. పన్నుల వాటా నిధుల్లో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు రూ. 19,208 కోట్లు కేటాయించారు. బిహార్‌కు రూ. 10,845 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ. 8,010 కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు రూ. 7,866 కోట్లు, మహారాష్ట్రకు రూ. 7,022 కోట్లు, రాజస్థాన్‌కు రూ. 6,460 కోట్లు కేటాయించారు. అత్యల్పంగా సిక్కింకు రూ. 365 కోట్లు విడుదల చేసింది కేంద్ర ప్రభుత్వం. అక్టోబర్ 31న కూడా కేంద్ర ప్రభుత్వం.. అదనపు పన్నుల వాటా కింద మరో రూ. 1,09,019 కోట్లను విడుదల చేసింది. దీంతో కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే రాష్ట్రాలకు మొత్తం రూ. 2,18,038 కోట్ల నిధులు అందాయి. ఈ లెక్కన ఈ ఆర్థిక సంవత్సరం (2026-27)లో ఇది రెండో అదనపు పన్నుల వాటా విడుదల. కేంద్ర పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు 41 శాతం వాటా లభిస్తుంది. ఆ మొత్తాన్ని ఆర్థిక సంవత్సరంలో 14 విడతలుగా రాష్ట్రాలకు కేంద్రం పంపిణీ చేస్తుంది. ముందస్తుగా నిధులు విడుదల చేయడం ద్వారా రాష్ట్రాలు మూలధన వ్యయాలను పెంచడంతోపాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు వినియోగించుకునే అవకాశం ఉంటుందని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడింది. ఇకపోతే 2026-27 కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల పన్నుల వాటా కింద రూ. 15.26 లక్షల కోట్లను కేటాయించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల్లో ఈ మొత్తం రూ. 13.93 లక్షల కోట్లుగా ఉంది.

ట్రంప్‌కు పదవీగండం

అధ్యక్ష పదవి నుంచి తొలగించే తీర్మానంపై డెమోక్రాట్ల కసరత్తు

ట్రంప్, ఆయన కుటుంబ సభ్యుల ఆర్థిక లావాదేవీలపైనా దృష్టి

అధికారం అండతో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు

హెగ్సెత్‌ను తొలగించేందుకు చర్యలు చేపడతాం: డెమొక్రాట్లు

అభిశంసనకు ప్రయత్నిస్తే నాశనమే!.. ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్: మధ్యంతర ఎన్నికల్లో పరాభవం ఎదుర్కొన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు.. మరో సవాలు ముందుకొచ్చింది. అమెరికా చట్టసభల్లో పూర్తి మెజారిటీ సాధించిన డెమొక్రాట్లు.. ట్రంప్‌పై అభిశంసన చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ట్రంప్, ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డారని, భారీగా లబ్ధిపొందారన్న ఆరోపణలపై సమగ్ర విచారణలకు సిద్ధమవుతున్నారు. వారి ఆర్థిక లావాదేవీలు, ప్రపంచవ్యాప్తంగా ట్రంప్ సంస్థలు చేపట్టిన రియల్ ఎస్టేట్, క్రిప్టో వ్యాపారాలు, ఎప్‌స్టీన్ కేసు వంటి అంశాలన్నీ తవ్వితీయాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ కమిటీలు, సబ్‌పీనా (తమ ఎదుట హాజరై సమాధానం చెప్పాలన్న) అధికారాల సాయంతో ట్రంప్ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేసేందుకు వ్యూహం రచిస్తున్నారు. మరోవైపు తనపై అభిశంసనకు ప్రయత్నిస్తే డెమొక్రాటిక్ పార్టీ నాశనం అవుతుందని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. ఈ పరిణామాలతో అమెరికా రాజకీయాలు ఏ మలుపు తీసుకుంటాయన్నది ఆసక్తిగా మారింది.

చట్టసభల్లో పూర్తి మెజారిటీతో..

అమెరికా కాంగ్రెస్ లోని సెనేట్‌లోని మొత్తం 100 సీట్లకుగాను 54 సీట్లు, ప్రతినిధుల సభలోని 415 సీట్లకుగాను 240 సీట్లను డెమోక్రాట్లు దక్కించు కున్నారు. సెనేట్‌లో ఫలితాలు రావాల్సిన అలాస్కా, మిస్సిస్సిప్పిలలోనూ డెమోక్రాట్లే ఆధిక్యంలో ఉన్నారు. ప్రస్తుత సభ్యుల పదవీకాలం జనవరిలో ముగుస్తుంది. కొత్తగా ఎన్నికైన వారు బాధ్యతలు చేపడతారు. అప్పుడే చట్టసభల్లో డెమొక్రాట్లకు మెజారిటీ సమకూరుతుంది. ఇరుసభలకు కొత్త స్పీకర్లను ఎన్నుకుంటారు. తమ ఎజెండాలకు అనుగుణంగా అధ్యక్షుడిపై అభిశంసన, విచారణలు వంటివి చేపడతారు. అధ్యక్షుడిపై అభిశంసన తీర్మానం ఆమోదం పొందాలంటే.. ప్రతినిధుల సభలో సగానికిపైగా సభ్యులు, సెనేట్‌లో మూడింట రెండొంతుల మంది మద్దతు ఇవ్వాలి. ప్రస్తుతం డెమొక్రాట్లకు సమకూరిన బలాన్ని చూస్తే.. ప్రతినిధుల సభలో తీర్మానం సులువే. సెనేట్‌లో ఆమోదం కోసం 67 ఓట్లు అవసరం. డెమొక్రాట్లకు 54 మంది ఉన్నారు. పెండింగ్‌లోని 2 స్థానాలు ఆ పార్టీకే వస్తే బలం 56కు పెరుగుతుంది. మరో 11 మంది సభ్యుల మద్దతు కావాలి.

మెజారిటీ పొందగానే అభిశంసన

అమెరికా చట్టసభల్లో వివిధ పార్టీలకు ఉన్న సభ్యుల సంఖ్యకు అనుగుణంగా.. వివిధ అంశాలపై విచారణ అధికారులను కేటాయిస్తారు. సభా కమిటీల్లో ఎక్కువ ప్రాతినిధ్యం లభిస్తుంది. స్పీకర్ పదవి వస్తుంది. సబ్‌పీనా అధికారం ఉంటుంది. అంటే మంత్రులు సహా ఎవరినైనా తమ ఎదుట హాజరై, సంబంధిత అంశాల్లో వివరణ, సమాధానం ఇవ్వాల్సిందిగా ఆదేశించవచ్చు. ఇప్పుడు డెమోక్రాట్లు ఈ అవకాశాలన్నీ వినియోగించుకుని ట్రంప్‌పై విచారణలు చేపట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రస్తుతం ప్రతినిధుల సభలో డెమోక్రాట్ల నేతగా ఉన్న హకీమ్ జెఫరీస్ త్వరలో స్పీకర్‌గా ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ట్రంప్‌పై అభిశంసన పెట్టే అవకాశం ఉందన్నారు. ఇరాన్‌పై యుద్ధానికి కారకుల్లో ఒకరైన రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌ను తొలగించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. ప్రతినిధుల సభలో పర్యవేక్షణ, న్యాయ కమిటీల్లో సభ్యులుగా ఉన్న డెమొక్రాట్లు రాబర్ట్ గార్సియా, జేమీ రస్కిన్‌లకు.. ట్రంప్, కుటుంబ సభ్యుల అవినీతిపై విచారణల బాధ్యతలను జెఫరీస్ కొన్ని నెలల క్రితమే అప్పగించారు. ఆ పని మొదలుపెట్టిన రాబర్ట్ గార్సియా.. ట్రంప్ కుటుంబ లావాదేవీలు, నిర్మాణ పనులు, ఖనిజాల ఒప్పందాల్లో పాత్ర, ఎప్‌స్టీన్ కేసు దర్యాప్తు తదితర వివరాలు సేకరించారు. తాజాగా గార్సియా రిపబ్లికన్లను, ట్రంప్ సన్నిహితులను ఉద్దేశిస్తూ.. "న్యాయవాదులను సిద్ధం చేసుకోండి" అని ఎక్స్‌లో సందేశం పెట్టారు. సెనేట్‌లో డెమోక్రాట్ల నేత చుక్ షూమర్ మాట్లాడుతూ.. ట్రంప్ ఇన్‌సైడర్ సమాచారంతో స్టాక్‌మార్కెట్లో లావాదేవీలు చేస్తున్నారని ఆరోపించా రు. ట్రంప్ రియల్‌ఎస్టేట్ ప్రాజెక్టులు, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్‌తో కలిసి నిర్వహిస్తున్న క్రిప్టో కరెన్సీ వ్యాపారాలపై విచారణ చేపడతామని సెనేట్‌లో డెమోక్రాట్ల నేత రిచర్డ్ బ్లూమెంటల్ చెప్పారు.

అభిశంసనకు ప్రయత్నిస్తే నాశనమే: ట్రంప్

డెమొక్రాట్లు తనపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తే ఆ పార్టీ నాశనం అవుతుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాల అనంతరం ట్రంప్ వైట్‌హౌజ్ వద్ద మీడియాతో మాట్లాడారు. "నాపై ఏ కారణంతో అభిశంసన పెడతారు? దేశాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళుతున్నందుకా? చరిత్రలో ఎన్నడూ లేనంత విజయవంతంగా దేశం ముందుకు వెళుతోంది. అయినా అభిశంసనపై నాకేం ఆందోళన లేదు. డెమొక్రాట్లు అలా చేస్తే.. వారి పార్టీ నాశనం అవుతుంది" అని ట్రంప్ హెచ్చరించారు. డెమొక్రాట్లు సహకరిస్తే కలిసి పనిచేసేందుకు సిద్ధమని.. ప్రభుత్వ నిర్ణయాలను అడ్డుకోవాలని చూస్తే వీటో అధికారాన్ని వినియోగిస్తానని చెప్పారు.

స్మార్ట్‌ఫోన్ ధరలకు రెక్కలు!

ఏఐ హవాతో బడ్జెట్ ఫోన్లపై భారం

30శాతం దాకా ధరలు పెరిగే అవకాశం

మూడు రెట్లు పెరిగిన చిప్‌ల ధరలు

రూ.16వేల లోపు ఫోన్ల తయారీపై

తీవ్ర ప్రభావం: జెఫరీస్ నివేదిక

న్యూఢిల్లీ: జెమిని, చాట్‌జీపీటీ వంటి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సాంకేతికత ప్రపంచాన్ని శాసిస్తోంది నిజమే.. కానీ ఆ ఏఐ మోజు ఇప్పుడు నేరుగా సగటు వినియోగదారుడి జేబుకు కన్నం పెట్టనుంది!. కొత్తగా స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేయాలని ఆశపడే వారిపై రాబోయే రోజుల్లో భారీగా ఆర్థిక భారం పడబోతోంది. ఇప్పటికే వివిధ కారణాలతో రెండు సార్లు పెరిగిన ధరలు.. ఇప్పుడు మరోసారి భారీగా పెరగనున్నాయి. ముఖ్యంగా తక్కువ ధరలో లభించే ఆండ్రాయిడ్ ఫోన్ల ధరలు మరో 30శాతం వరకు పెరిగే ప్రమాదం ఉందని ప్రముఖ గ్లోబల్ రిసర్చ్ సంస్థ జెఫరీస్ వెల్లడించింది. ఏఐ సాంకేతికతకు అవసరమైన ప్రాసెసర్, మెమరీ చిప్‌లకు డిమాండ్ విపరీతంగా పెరగడమే ఇందుకు కారణమని పేర్కొంది. 2027 నాటికి మెమరీ చిప్‌ల సప్లైలో 60శాతం వాటా ఏఐ రంగమే వినియోగించుకోవచ్చని తెలిపింది. డేటా సెంటర్లు, ఏఐ మౌలిక సదుపాయాల కోసం టెక్ కంపెనీల నుంచి మెమరీ చిప్స్‌కు విపరీతమైన గిరాకీ ఏర్పడటంతో మార్కెట్లో వీటికి తీవ్ర కొరత ఏర్పడుతోంది. నిన్నమొన్నటి దాకా ఒక మెమరీ యూనిట్ ధర 20 డాలర్లు(సుమారు రూ.1680) ఉండగా, ప్రస్తుతం అది ఏకంగా 60నుంచి 65 డాలర్లకు(సుమారు రూ. 5000), అంటే మూడు రెట్లు పెరిగిపోయింది. దీని ప్రభావం ముఖ్యంగా 200డాలర్ల లోపు (సుమారు రూ.16వేలు) లభించే బడ్జెట్ ఫోన్ల ఉత్పత్తి వ్యయంపై పడుతోంది. అందుబాటు ధరల్లో ఉండే ఈ స్మార్ట్‌ఫోన్ తయారీకి అయ్యే మొత్తం ఖర్చులో మెమరీ చిప్‌ల వాటానే 60శాతం దాకా ఉంటుంది. దీంతో భారాన్ని నేరుగా కొనుగోలుదారులపై వేసేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. జెఫరీస్ అంచనా ప్రకారం.. అంతర్జాతీయ మార్కెట్‌లో సామాన్యులకు అందుబాటు ధరలో ఉండే బడ్జెట్ సెగ్మెంట్ వాటా తీవ్రంగా పడిపోనుంది. ఖరీదైన ప్రీమియం ఫోన్ల వాటా 29-38శాతానికి పెరుగుతుందని పేర్కొంది. కాగా, ఈ రకమైన తయారీ ఖర్చులను తగ్గించుకోవడానికి మొబైల్ కంపెనీలు సరికొత్త దారులు వెతుక్కుంటున్నాయి. కొత్తగా వచ్చే ఫోన్లలో తాజా ఫ్లాగ్‌షిప్ ప్రాసెసర్‌లకు బదులుగా, ఒకటి రెండేళ్ల పాత చిప్‌లను వాడటంపై ఆలోచిస్తున్నారు.



ఒకే వేదికపై విజయ్, జగన్, కేటీఆర్

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, ఏపీ మాజీ సీఎం జగన్, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ ఒకే వేదికపై కనిపించారు. చెన్నైలో జరిగిన వివాహ వేడుక ఇందుకు వేదికైంది. జగన్ బాబాయ్ వైఎస్ జార్జ్‌రెడ్డి కుమారుడు వైఎస్ అనిల్ రెడ్డి కుమార్తె శ్రేయ వివాహం ఉజ్వల్‌తో జరిగింది. గురువారం చెన్నైలోని ఓ హోటల్లో క్రైస్తవ మత సంప్రదాయం ప్రకారం జరిగిన ఈ వివాహానికి జగన్ దంపతులు, కేటీఆర్ దంపతులు, విజయ్, నటి త్రిష హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జగన్, విజయ్ ఆత్మీయాలింగనం చేసుకున్నారు. విజయ్, జగన్, కేటీఆర్ సరదాగా ముచ్చటించుకున్నారు. విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్, వైఎస్ఆర్ సతీమణి విజయమ్మ, సినీ నటుడు మంచు మనోజ్ దంపతులు, ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ కూడా హాజరయ్యారు. వేదిక ముందు వరుసలో గౌతం అదానీతో కలిసి విజయ్, జగన్ కూర్చుని మాట్లాడుతూ కనిపించారు.



ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి నాయనమ్మ రంగనాయకమ్మ కన్నుమూత





శాలిగౌరారం, అక్టోబర్ 5 : భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి నాయనమ్మ చామల రంగనాయకమ్మ (96) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున శాలిగౌరారంలో కన్నుమూశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు చామల నరోత్తం రెడ్డి గత రెండు సంవత్సరాల క్రితం గుండెపోటుతో మరణించారు. చిన్న కుమారుడు ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి తండ్రి వాసుదేవరెడ్డి. రంగనాయకమ్మ మృతి పట్ల కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేసి, భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. ఆమె అంత్యక్రియలు గురువారం సాయంత్రం అక్రునయనాల మధ్య జరిగాయి. అంత్యక్రియల యాత్రలో రంగనాయకమ్మ పాడెను ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి మోశారు.ఈ కార్యక్రమం లో ప్రభుత్వ విప్ లు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం,అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత,జనగాం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైదా రవీందర్,కాంగ్రెస్ అధికార ప్రతినిధి నూక కిరణ్ కుమార్ యాదవ్ శాలిగౌరారం మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చింత ధనుశీజయ్య, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

నేడు శాలిగౌరారం మండల ప్రజా పరిషత్ సమావేశం

శాలిగౌరారం : శాలిగౌరారం మండల ప్రజా పరిషత్, గ్రామ పంచాయతీల సమీక్షతో పాటు సామర్థ్య వృద్ధి సమావేశం 6 న శుక్రవారం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఇన్‌చార్జ్) శ్రీ ఎం.శ్రీనివాసచారి తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, మండల స్థాయి అధికారులు వారి శాఖకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలు తీసుకొని రావాలని కోరారు.

శాలిగౌరారం మెడికల్ ఆఫీసర్ సస్పెన్షన్..!



శాలిగౌరారం : అక్రమ కారుణ్య నియామక ప్రతిపాదనలు పంపినట్లు తేలడంతో శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సూర్యశిల్పను సస్పెండ్ చేశారు. కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ రాహుల్ ఉత్తర్వులు జారీ చేశారు. కారుణ్య నియామకానికి సంబంధించి ఆమె పంపిన ప్రతిపాదనలను డీఎంహెచ్ఓ రెండుసార్లు తిరస్కరించినా, మూడోసారి పంపినట్లు అధికారులు గుర్తించారు. తప్పుడు ప్రతిపాదనలు పంపినట్లు తేలడంతో ఈ చర్య తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శాలిగౌరారం వైద్యాధికారిగా వెంకన్న బాధ్యతల స్వీకరణ



శాలిగౌరారం : శాలిగౌరారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ వెంకన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వైద్యాధికారి డాక్టర్ సూర్యశిల్ప సస్పెండ్ కావడంతో ఆమె స్థానంలో వెంకన్న బాధ్యతలు చేపట్టారు. గతంలో వెంకన్న శాలిగౌరారం మండల వైద్యాధికారిగా 8 సంవత్సరాలు పనిచేసి ఉత్తమ డాక్టర్ గా అవార్డు పొందారు. శాలిగౌరారం ఆసుపత్రిని రాష్ట్రంలోనే ఉత్తమ ఆసుపత్రిగా పేరు ప్రఖ్యాతులు వచ్చే విధంగా కృషి చేశారు.

ఎస్ఎల్‌బీసీ పూర్తయితే డెడ్‌స్టోరేజీ నుంచీ సాగు నీరు సాధ్యం

మంత్రి కోమటిరెడ్డి కీలక వ్యాఖ్య
కరువొచ్చినా రైతులకు నీటి ఇబ్బందులుండకుండా చేస్తాం
నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్ర మాణ స్వీకారం



ప్రజా దీవెన, నల్లగొండ : ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్త యి తే ఎంతటి కరువు పరిస్థితులు ఎ దురైనా శ్రీశైలం ప్రాజెక్టు డెడ్‌స్టో రేజీ నుంచి నీటిని తరలించి రైతు లకు సాగునీరు అందించే అవ కా శం ఉంటుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తితో నల్గొండ జిల్లా సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభి స్తుందని ఆయన పేర్కొన్నారు.

గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలోని జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన న ల్గొండ వ్యవసాయ మార్కెట్ కమి టీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లతో మార్కెటింగ్ శాఖ సహా య సంచాలకులు ఛాయాదేవి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ మార్కెట్ కమిటీ పద వు లు కేవలం హోదాలు మాత్రమే కాదని, రైతులకు నేరుగా సేవలం దించే కీలక బాధ్యతలని అన్నా రు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా నూతన పాలకవర్గం పనిచేయా లని సూచిం చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నల్గొండ మార్కెట్ కమిటీకి రెండో పాలకవ ర్గం ఏర్పాటవడం సంతోషకరమన్నారు.

ఫ్లోరైడ్ సమస్యకు ఎస్ఎల్‌బీసీతో పరిష్కారం

నల్గొండ జిల్లాను ఫ్లోరైడ్ రహితం గా మార్చడంతోపాటు జిల్లా అం తటా సాగునీరు అందించాలనే లక్ష్యంతో సుమారు రూ.2,000 కోట్లతో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును చేపట్టినట్లు మంత్రి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పను లు నిలిచిపోయాయని, ప్రజా ప్ర భుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి ప్రారంభించామని తెలిపారు. మధ్యలో మరోసారి పనులకు ఆటంకం ఏర్పడినప్ప టికీ ఇటీవలే తిరిగి పనులు ప్రా రంభించి వేగవంతం చేసినట్లు వె ల్లడించారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా జిల్లా మొ త్తాన్ని సస్యశ్యామలం చేయా లన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పా రు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును తమ హయాంలోనే చేపట్టామని, ఇప్పటివరకు 35 వేల ఎకరాలకు సాగునీరు అందించామని తెలి పారు. లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచే స్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.450 కోట్లతో ఏఎంఆర్‌పీ కాలువల లైనింగ్

ఏఎంఆర్‌పీ కాలువల లైనింగ్ ప నులను రూ.450 కోట్లతో చేప ట్టినట్లు మంత్రి తెలిపారు. ము శంపల్లి సబ్‌స్టేషన్‌తోపాటు రహ దారి కూడా మంజూరు చేయిం చినట్లు వెల్లడించారు. జిల్లాలో కాలువలు, రిజర్వాయర్లు పూ ర్త యితే పరిసర ప్రాంతాల్లో భూ గ ర్భ జలాలు పెరిగి బోర్లలో నీటి ల భ్యత మెరుగుపడుతుందని వివ రించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఉచి త విద్యుత్ పథకం రైతులకు ఎం తో ప్రయోజనం చేకూర్చిందని, ప్రస్తుతం దేశంలోని పలు రాష్ట్రా ల్లోనూ ఈ విధానం అమలవు తుండటం విశేషమని అన్నారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనూ వివిధ అభివృద్ధి ప నులు కొనసాగుతున్నాయని తె లిపారు. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర ప్రజలకు ముందస్తుగా దీ పావళి శుభాకాంక్షలు తెలియజే శారు.

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

నల్గొండ వ్యవసాయ మార్కెట్ క మిటీ చైర్మన్‌గా బి. హేమలత వెం కటరెడ్డి, వైస్ చైర్మన్‌గా వి. శ్రీని వాస్ గౌడ్ ప్రమాణ స్వీకారం చే శారు. వీరితోపాటు నూతన డైరె క్టర్లు కూడా బాధ్యతలు స్వీకరిం చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్సీ శంకర్ నాయక్, నల్గొండ మే యర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివా స్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఛా యాదేవి తదితరులు పాల్గొన్నా రు.



ఈవిఎం భద్రపరిచిన గోదాం వద్ద భద్రతను పటిష్టం

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈ వి ఎం) భద్రపరిచిన గోదాం వద్ద భద్రతను పటిష్టం చేయా లని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదామును తనిఖీ చేశారు . గోదాం వద్ద అప్రమత్తంగా కాపలా ఉండాలని, కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు నుండి గోదాం వరకు గార్డు ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా కలెక్టరేట్ కార్యాలయంలో కి రాత్రి సమయంలో ఎవరు ప్రవేశించ కుండా ప్రధాన ద్వారాన్ని,గేటును మూషించాలని,అలాగే గోడౌన్ గేటును తాళం వేసి ఉంచాలని చెప్పారు. గోడౌన్ లోని సిసి టీవీ ని కలెక్టర్ తనిఖీ చేసి సి సి కెమ రాలన్ని నిరంతరం పనిచేసే వి ధంగా జాగ్రత్తలు తీసుకోవా లని గార్డును ఆదేశించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ గార్డు రిజిస్టర్ ను తనిఖీ చేశారు. రెవె న్యూ ఆదనపు కలెక్టర్ జె. శ్రీని వాస్, ఎన్నికల విభాగం పర్య వేక్ష కులు కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

రైతు బహిరంగ సభను జయప్రదం చేయండి



ప్రజా దీవెన, కోదాడ : నల్లగొండ పట్టణంలో నవంబర్ 15న లక్షలాది మంది చే జరిగే రైతు బహిరంగ సభకు వేలాదిగా కదిలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు పిలుపునిచ్చారు గురువారం కోదాడ పట్టణంలో స్థానిక సుందరయ్య భవన్లో నియోజ కవర్గ సిపిఎం విస్తృత స్థాయి సమావేశం పట్టణ కార్యదర్శి ఎం ముత్యాల అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాములు పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 12 సంవత్సరాల కాలంలో వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టబడిందని ఫలితంగా దేశవ్యాప్తంగా రైతులు ఆత్మహత్యలు పెరిగాయని ఆయన విమర్శించారు వ్యవసాయ రంగంలో సంస్కరణ తీసుకొచ్చి భారత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులు కట్టబెట్టేందుకు మోడీ సర్కార్ ప్రయత్నిస్తుందని ఆయన విమర్శించారు మోడీ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు ఇచ్చేందుకు నాలుగు నల్ల చట్టాలు తెచ్చిన ఫలితంగా రైట్తాంగం పోరాడే ఆ ఆ చట్టాలను రద్దు చేసేంతవరకు పోరాడిన చరిత్ర రైతాంగానికి ఉ ందని ఆయన గుర్తు చేశాడు ఈ నేపథ్యంలో భారత రైతాంగాన్ని కాపాడాలని స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు చేయాలని పార్లమెంటులో ఎంఎస్పి చట్టం తీసుకురావాలని రానున్న కాలంలో జరిగే పోరాటంలో నల్లగొండలో జరిగే అఖిలభారత మహాసభ ఒక వేదిక కానున్నది అని ఆయన అన్నారు నవంబర్ 15 నల్గొండలో జరిగే రైతు బహిరంగ సభకు రైతులు కూలీలు కార్మికులు పేదలందరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మేదరమట్ల వెంకటేశ్వరరావు సిఐటియు జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకటనారాయణ జిల్లా కమిటీ సభ్యులు షేక్ సైదా ముసగాల మండల కార్యదర్శి బురి శ్రీరాములు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం బెల్లంకొండ సత్యనారాయణ జుట్టు కొండ బసవయ్య వివిధ మండలాలకు చెందిన మండల కార్యదర్శిలు అలస గాని బ్రహ్మయ్య రాపోలు సూర్యనారాయణ నాగటి రాములు కాసాని కిషోర్ కోటేశ్వరరావు చందా చంద్రయ్య స్టాలిన్ రెడ్డి సోమపగు జానయ్య తుమ్మ సతీష్ తదితరులు పాల్గొన్నారు

పోరాటాల పురిటిగడ్డ నల్గొండలో ఏఐకేఎస్ జాతీయ మహాసభలకు సర్వం సిద్ధం

నవంబర్ 15న లక్ష మంది రైతు లతో భారీ ప్రదర్శన

ఎన్జీ కళాశాల మైదానంలో బహిరంగ సభ

నాలుగు రోజుల పాటు 36వ జాతీయ మహాసభలు

950 మందికి పైగా ప్రతినిధులు, నాయకుల హాజరు

ప్రజా దీవెన, నల్లగొండ : చారిత్రా త్మక రైతాంగ పోరాటాలకు వేదిక గా నిలిచిన పోరాటాల పురిటిగ డ్డ నల్గొండలో అఖిల భారత కిసా న్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీ య మహాసభలకు రంగం సిద్ధమ వుతోంది. నవంబర్ 15 నుంచి 18 వరకు నాలుగు రోజుల పా టు నిర్వహించనున్న ఈ మహా సభలను విజయవంతం చేయా లని రైతు సంఘం జాతీయ నా యకులు, ఆహ్వాన సంఘం అ ధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి పి లుపునిచ్చారు. ముఖ్యంగా న వంబర్ 15న లక్ష మంది రైతుల తో నిర్వహించనున్న భారీ ప్రద ర్శన, అనంతరం ఎన్జీ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ స భకు రైతులు, ప్రజలు పెద్ద సం ఖ్యలో తరలిరావాలని కోరారు. గురువారం దొడ్డి కొమురయ్య భ వన్‌లో నిర్వహించిన మహాసభ ల సన్నాహక సమావేశంలో జూ లకంటి రంగారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1.58 కోట్లకు పైగా సభ్యత్వంతో అఖిల భారత కి సాన్ సభ ప్రపంచంలోనే అతిపెద్ద రైతాంగ ఉద్యమ సంస్థగా కొనసా గుతోందని తెలిపారు. సామ్రాజ్య వాదం, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక పోరాటాల స్ఫూర్తితో రైతాంగ హ క్కుల పరిరక్షణకు సంస్థ నిరంత రం ఉ ద్యమిస్తోందన్నారు. తెలం గాణ సాయుధ రైతాంగ పో రా టం, తెభాగా, వర్లీ ఆదివాసీ, పు న్నప్ర-వయలార్, సుర్మా లోయ రై తాంగ పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా రైతులను ఐక్యం చేస్తున్నట్లు వి వరించారు.

రైతాంగం సంక్షోభంలో.. విధానా ల మార్పు అవసరం

దేశానికి అన్నం పెట్టే రైతాంగం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నె ముకగా ఉన్న శ్రమజీవులు ప్ర స్తుతం అనేక సమస్యలను ఎదు ర్కొంటున్నారని రంగారెడ్డి ఆవే దన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా అ మ లవుతున్న ఆర్థిక విధానాలు, అ సమాన మార్కెట్ వ్యవస్థ, బల హీనమైన సామాజిక భద్రత, ప్ర కృతి వైపరీత్యాలు వ్యవసాయ రంగ సంక్షోభాన్ని మరింత తీవ్ర తరం చేస్తున్నాయని విమర్శిం చారు. 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీ జేపీ ప్రభుత్వం రైతుల ఆదా యా న్ని రెట్టింపు చేస్తామన్న హామీని నెరవేర్చలేదని, వ్యవసాయ సం క్షోభానికి శాశ్వత పరిష్కారం చూ పడంలో విఫలమైందని ఆరో పిం చారు. పెట్టుబడి ఖర్చులు పెరు గుతున్నప్పటికీ పంటలకు గిట్టు బాటు ధరలు లభించక రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుంటు న్నారని పేర్కొన్నారు.రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కా



ర్మికులకు కనీస వేతనాలు, గ్రా మీణ పేదలకు ఉపాధి, భూమిలే ని నిరుపేదలకు భూమి, ప్రతి ఒ క్కరికీ సామాజిక భద్రత కల్పిం చే లా ప్రభుత్వాలు సమగ్ర వి ధానా లను అమలు చేయాలని డిమాం డ్ చేశారు.

ఐక్య ఉద్యమాలే రైతాంగ సమ స్యలకు పరిష్కారం

రైతులు, కౌలు రైతులు, వ్యవసా య కార్మికులు, గిరిజనులు, మ హిళా రైతులు ఐక్యంగా ఉద్య మించాల్సిన అవసరం ఉందని జూలకంటి రంగారెడ్డి పిలుపుని చ్చారు. కులం, మతం పేరుతో ప్రజలను విభజించే ప్రయత్నాల కు బదులుగా భూమి, జీవనోపా ధి, ఉపాధి, ఆహార భద్రత వంటి మౌలిక సమస్యలపై ప్రజలు సం ఘటితం కావాలని కోరారు.

నవంబర్ 14న రైతు ఎగ్జిబిషన్.. 15న భారీ ప్రదర్శన

నవంబర్ 15 నుంచి 18 వరకు జరిగే 36వ జాతీయ మహాసభ లకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 950 మందికి పైగా ప్రతిని ధులు, పరిశీలకులు, నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. మహాసభలలో భాగంగా నవం బ ర్ 14న రైతు ఎగ్జిబిషన్ నిర్వ హించనున్నారు. ఇందులో వ్యవ సాయ రంగ చరిత్ర, చారిత్రక రై తాంగ పోరాటాలు, ఉద్యమాలు, ప్రస్తుత వ్యవసాయ పరిస్థితుల ను ప్రతిబింబించే అంశాలను ప్ర దర్శించనున్నారు.నవంబర్ 15న నల్గొండ నగరంలో లక్ష మంది రై తులతో భారీ ప్రదర్శన నిర్వహిం చి, అనంతరం ఎన్జీ కళాశాల మై దానంలో భారీ బహిరంగ సభ జ రపనున్నారు. రైతాంగ సమస్య లు, వ్యవసాయ రంగ భవిష్య త్తు, రైతుల హక్కుల పరిరక్షణపై దేశవ్యాప్త చర్చకు ఈ జాతీయ మహాసభలు కీలక వేదికగా నిల వనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ రా ష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరా రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్య క్షులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, కార్యదర్శి వీరపల్లి వెంకటేశ్వర్లు, మహిళా కన్వీనర్ కందాల ప్రమీ లతో పాటు ప్రజాసంఘాల నా యకులు నారి ఐలయ్య, డబ్బి కార్ మల్లేష్, సయ్యద్ హషం, పాలడుగు ప్రభావతి, ఎండీ స లీం, దండెంపల్లి సత్తయ్య, కంబా లపల్లి ఆనంద్, అవిశెట్టి శంకర య్య, బొజ్జ చిన్న వెంకులు, చిం తపల్లి బయన్న, రాసకొండ వెం కట్ గౌడ్, కొండ అనురాధ, రవి నాయక్, మల్లయ్య, రెమిడాల పరుశరాములు, ఉడుగుండ్ల రా ములు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌ను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజా దీవెన, నల్లగొండ: నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిది ద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపా రు.గురువారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు . నల్గొండ కార్పొరేషన్ పరిధిలోని కథాల్ గూడ వద్ద 10 కోట్ల రూపా యల వ్యయంతో కథాల్ గూడా నుండి రాజీవ్ గృహకల్ప గృహ సముదాయం వరకు 3 కిలోమీ టర్ల మేర చేపట్టనున్న రోడ్డు విస్తరణ ,పటిష్ట పరిచే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మీడియా ప్రతినిధుల తో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 25వేల కోట్ల రూపాయలతో హ్యాం రోడ్లను చేపట్టడం జరిగిందని, దేశంలో ఏ రాష్ట్రంలో ఇలాంటి రోడ్లు వేయటంలేదని, ముఖ్యంగా మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రం వరకు, గ్రామాల నుండి మండల కేంద్రాల వరకు డబుల్ రోడ్లను వేస్తున్నట్లు తెలిపారు. సుమారు 9000 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మిస్తున్నామని, నల్గొండ జిల్లాలో 2000 కోట్ల రూపాయలతో డబుల్ రోడ్లు నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు.రహదారుల అభివృద్ధిలో భాగంగా నల్గొండ నుండి ధర్వేశిపురం వరకు ఆరు లైన్ల రహదారిని 50 కోట్ల రూపాయలతో చేపట్టడం జరిగిందని, అలాగే ధర్వేశిపురం నుండి కనగల్ వరకు హ్యాం రోడ్డు చేపట్టామన్నారు. కథాల్ గూడా రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన ఆర్ అండ్ బి



అధికారులను ఆదేశిస్తూ పనులు నాణ్యతగా చేపట్టాలని చెప్పారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో కార్పొరేషన్ లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు .ఇందులో భాగంగా రాష్ట్ర నిధులతో ఆర్టీసీ డిపోను పూర్తిగా ఆధునికరించడం జరిగిందని, కార్పొరేషన్ పరిధిలో ప్రతి ఇంటికి నల్లాలు ఏర్పాటు చేయడం, అలాగే 24 గంటలు తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వీటన్నిటిని రానున్న ఒకటిన్నర సంవత్సరాలలో పూర్తి చేస్తామని వెల్లడించారు రోడ్లతోపాటు, నల్గొండ పట్టణంలో పేదవారికి ఇళ్ల కేటాయింపులో భాగంగా హౌసింగ్ బోర్డ్ పక్కనే స్థలాన్ని కేటాయించామని, జి ప్లస్ త్రీ మోడల్ లో 500 గృహాలను ఇల్లు లేని పేదలకు ఇల్లు కట్టించి ఇస్తామని మంత్రి వెల్లడించారు . అంతకు ముందు మంత్రి భవిత కేంద్రం ఆవరణలో 17 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సమీకృత మండల కాంప్లెక్స్ భవన సముదాయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎం ఎల్ సి శంకర్ నాయక్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి ,ఆర్ అండ్ బి ఎస్ ఈ మోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ గణేష్, ఆర్డిఓ వై అశోక్ రెడ్డి, ఇతర అధికారులు, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, 11వ డివిజన్ కార్పొరేటర్ పాలకురి సుమలత సంతోష్ గౌడ్ ,ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జిల్లా క్రీడా అధికారి

రూ.3.10 లక్షల భోజన బిల్లుల చెల్లింపునకు లంచం డిమాండ్

ప్రజా దీవెన, మహబూబ్‌నగర్: ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీ తికి అడ్డుకట్ట వేసేందుకు ఏసీబీ అధికారులు చేపడుతున్న చర్య లు కొనసాగుతున్నాయి. ఈ క్ర మంలో మహబూబ్‌నగర్ జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాల యంలో పనిచేస్తున్న జిల్లా యు వజన, క్రీడల అధికారి, కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న టైపిస్ట్ ఏసీబీ వలలో చిక్కారు. అధికారిక పనిని పూర్తి చేసేందుకు ఏ కంగా రూ.లక్ష లంచం తీసుకుంటూ ఇద్దరూ రెడ్‌హ్యాండెడ్‌గా ప ట్టుబడటం జిల్లాలో కలకలం రే పింది.ఏసీబీ వివరాల ప్రకారం.. జిల్లా యువజన, క్రీడల అధికారి జక్కు రాజశేఖర్ రెడ్డి (AO-1),టై పిస్ట్ గోరె ఉమేష్ (AO-2) కలిసి ఫిర్యాదుదారుడి నుంచి రూ.లక్ష లంచం డిమాండ్ చేశారు. ఆగస్టు 2026 నెలకు సంబంధించి SA TG వాలీబాల్ హాస్టల్‌లో ఉంటు న్న క్రీడాకారులకు అందించిన భో జనానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రాసెస్ చేసి, ఆమోదిం చి, రూ.3.10 లక్షల చెక్కును వి డుదల చేయడానికి ఈ మొత్తా న్ని డిమాండ్ చేసినట్లు ఏసీబీ వె ల్లడించింది. ఈ మేరకు నవంబర్ 5న మహ బూబ్‌నగర్ పరిధిలోని ఏసీబీ అ ధికారులు పక్కా ప్రణాళికతో దా డి చేసి, రూ.లక్ష నగదును స్వీక రిస్తున్న సమయంలో జిల్లా క్రీడా అధికారి రాజశేఖర్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ యన వద్ద నుంచి లంచం సొమ్ము ను స్వాధీనం చేసుకున్నారు.ఈ లంచం మొత్తాన్ని ఇద్దరూ పంచు కోవాలనే ముందస్తు ఒప్పందం మేరకు AO-1 తనతో పాటు A O-2 తరఫున కూడా నగదును స్వీకరించినట్లు ఏసీబీ పేర్కొంది. అధికార హోదాను అడ్డుపెట్టు కు ని అక్రమంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నించినట్లు ప్రాథమికంగా గుర్తించింది. ఇద్దరు నిందితులను అరెస్టు చే సిన ఏసీబీ అధికారులు నాంప ల్లిలోని స్పెషల్ జడ్జి కేసుల ప్ర త్యేక న్యాయస్థానంలో హాజరు పరిచి న్యాయపరమైన రిమాండ్ కు తరలించే ప్రక్రియ చేపట్టారు. ఈ ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోంది. ఫిర్యాదుదారుడి భద్రత దృష్ట్యా ఆయన వివ రాల ను ఏసీబీ గోప్యంగా ఉంచింది.



లంచం అడిగితే 1064కు ఫోన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ప నులు చేసిపెట్టేందుకు లంచం డి మాండ్ చేస్తే ప్రజలు భయపడ కుండా తెలంగాణ ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చే యాలని అధికారులు సూచించారు. వాట్సాప్: 9440446106, ఫేస్‌బుక్: Telangana ACB, ఎక్స్ (ట్విట్టర్): @Telangana ACB, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఏసీబీ క్యూఆర్ కో డ్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల పేర్లు, వ్యక్తిగత వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

ఉద్యోగార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి





మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజా దీవెన, నల్లగొండ: ఎస్సై, కానిస్టేబుల్ ఉ ద్యోగార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యా న్ని సాధించాలని రాష్ట్ర రోడ్లు, భ వనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అ న్నారు. కొట్లాడి తెచ్చుకున్న తె లంగాణలో నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉ ద్యోగ అవకాశాలు రావాలన్నదే తమ తపన అని తెలిపారు. గురువారం మంత్రి నల్గొండ జిల్లా కేంద్రంలోని టీటీ డీసీలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ అభ్యర్థులకు ఎస్సై, కా నిస్టేబుల్ ఉద్యోగాలకు ఇస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమానికి ము ఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిక్షణ పొందే అభ్యర్థులకు ప్రభుత్వం తరఫున అన్ని అవకాశాలు కల్పిస్తామని, అంతేకాక కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా తన వంతు సహకారం అందిస్తానని, ప్రత్యేకించి చదువుకునే విద్యార్థులకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ పొందిన తర్వాత ఉద్యోగం రాని వారు నిరుత్సాహపడకుండా మరోసారి ప్రయత్నించాలని, ఒక



లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని లక్ష్యసాధన కృషి చేస్తే తప్పనిసరిగా ఉద్యోగం వస్తుందని అన్నారు. తాను కూడా ప్రజాప్రతినిధిగా, ప్రత్యేకించి ఎమ్మెల్యే, మంత్రిగా కావాలన్న పట్టుదలతోనే విద్యార్థి దశ నుండి కృషి చేశానని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని, అనంతరం ఎం ఎల్ గా మంత్రిగా నల్గొండకు మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయాన్ని అనేక విద్యాసంస్థలను ,అభివృద్ధి కార్యక్రమాలను తీసుకురావడం జరిగిందని తెలిపారు. కాగా ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు కోమటిరెడ్డి ప్రతిక్ ఫౌండేషన్ ద్వారా స్టడీ మెటీరియల్ ను ఉచితంగా అందజేశారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ , ఎస్సై ,కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులు శిక్షణను ఉ పయోగించుకోవాలని, పరీక్ష ఉత్తీర్ణులవ్వడం ద్వారా ఉద్యోగం పొంది కుటుంబాలకు ఉ పయోగపడాలని అన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న అభ్యర్థులు కష్టపడి చదవాలని, తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని ,చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఎస్పీ శరత్చంద్ర పవర్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవర్ అధ్యక్షత వహించగా, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, డిఎస్పి శివరామిరెడ్డి, పోలీసు అధికారులు, తదితరులు హాజరయ్యారు. అనంతరం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఎస్ఐ, కానిస్టేబుల్ రాత పరీక్షకు అవసరమైన స్టడీ మెటీరియల్ను మంత్రి పంపిణీ చేశారు .

విప్లవ కవి దాశరథి కృష్ణమాచార్యకు ఘన నివాళి

ప్రజా దీవెన తుంగతుర్తి: నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో తన కలం, గళం ద్వారా ప్రజలను చైతన్యపరిచి, నేటి తెలంగాణ స్వరాష్ట్ర సాధన వరకు పోరాడిన అమరుడు విప్లవ కవి దాశరథి కృష్ణమాచార్య అని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య అన్నారు. తుంగతుర్తి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, పట్టణ అధ్యక్షులు గోపగాని శ్రీనివాస్, మండల నాయకులు గోపగాని రమేష్, నల్లబెల్లి వెంకటేష్, గోపగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అలుపెరుగని పోరాటయోధుడు నల్ల నర్సింహులు



వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యకులు చకిలం ఉపేందర్

ప్రజా దీవెన, వరంగల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో టైగర్ నల్లా నర్సింహులు అలుపెరుగని పోరాట యోధుడని వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చకిలం ఉపేందర్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం వరంగల్ హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ల అధ్వర్యంలో చకిలం ఉపేందర్ అధ్యక్షతన గురువారం జరిగిన తెలంగాణ టైగర్ నల్లా నర్సింహులు 33వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఈ తరం ప్రజలు వారి స్ఫూర్తిని పొంది ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ బార్ కౌన్సిల్ మెంబర్ దుస్సా జనార్దన్ మాట్లాడుతూ నల్లా నర్సింహులు నిరంకుశ విస్నూరు దొరను, భూస్వామ్యుల ఆగడాలను ఎదిరించి ఎన్నో కేసులను ఎదుర్కొన్నారని, వారితో తనకు గల సహచర్యాన్ని అనుభవాలను పంచుకున్నారు. తొర్రూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వీర వెంకట రత్నం మాట్లాడుతూ నల్లా నర్సింహులు జీవిత చరిత్ర చదివి ప్రేరణ పొందానని నల్ల నర్సింహులు తీవ్ర నిర్బంధంలో కూడా తను నమ్మిన ఆశయాలకోసం పోరాడారని, తెలంగాణ పేద రైతులకోసం ఉరికొయ్యలను కూడా ఎదిరించి పోరాడిన చరిత్ర వారిదని, యువతరం తెలంగాణ పోరాటయోధులను మరువరాదని అన్నారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ నల్లా నరసింహులు భూమికోసం, భుక్తికోసం వెట్టిచాకిరి విముక్తికోసం పోరాడారని, ఆయన పోరాట స్ఫూర్తిని పొంది బహుజనుల హక్కుల కోసం ఐక్య పోరాటం చేయాలని అన్నారు.

వరంగల్ బార్ మాజీ అధ్యక్షులు వలస సుధీర్ మాట్లాడుతూ నల్ల నర్సింహులుకు అనాటి పాలకులు మూడుసార్లు ఉరిశిక్ష విధించబడినప్పటికీ ఆయన ధైర్యం కోల్పోలేదని, న్యాయస్థానాల్లో సైతం ధైర్యంగా తన వాదనలు వినిపించారని

ఆయన ధైర్యసాహసాలను చూసి పోలీసు అధికారులు సైతం ఆశ్చర్యపోయేవారని అంటూ ఆయన భార్య వజ్రమ్మ త్యాగం కూడా అనన్యమైనదని, నల్లా నరసింహులు భార్య వజ్రమ్మ కూడా పోరాట జీవితంలో అనేక కష్టాలను ఎదుర్కొన్నారని

భర్త ఉద్యమంలో ఉన్న సమయంలో ఆమెను కూడా అరెస్టు చేసి జైలులో ఉంచారని, జైలులో ఉన్నప్పుడే ఆమె ఒక ఆడశిశువుకు జన్మనిచ్చినట్లు తెలియజేస్తూ పీడిత ప్రజల విముక్తి కోసం నల్లా నర్సింహులు తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత పోరాట యోధుడని అలాంటి మహనీయుల నుండి బహుజన సమాజం స్ఫూర్తి పొంది అసమానతలను ప్రశ్నించే చైతన్యాన్ని సాధించి ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ బీసీ ఎస్సీ ఎస్టీ లు తమ హక్కులకోసం ఏకమై ఐక్య ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో మరుగునపడిన నల్ల నర్సింహులు చరిత్రను భావితరాలకు అందించాలని తన వయసును లెక్కచేయకుండా అవిరామంగా కృషి చేస్తున్న సామాజిక వేత్త పెద్దలు దాసరి జనార్దన్ ను వరంగల్ బార్ అధ్యక్షులు చకిలం ఉపేందర్ శాలువతో సత్కరించారు.

ఈ సమావేశంలో ఇరు బార్ అసోసియేషన్ల కార్యదర్శులు ఆర్ నాగేంద్ర చారి, ఊరుగొండ నరేందర్, ఉపాధ్యక్షురాలు వి లలితకుమారి, రఘుపతి, సంయుక్త కార్యదర్శి ఆడెపు సునిల్, సీనియర్ న్యాయవాదులు దాసరి ప్రేమ్ సాగర్, సాయిని నరేందర్, చిల్ల రాజేంద్ర ప్రసాద్, విలాసాగరం సురేందర్ గౌడ్, నీలా శ్రీధర్, సిద్ధు నాయక్, నర్సింగరావు, జన్ను పద్మ, నర్సింగ్, గంజి రమేష్, రాచకట్ల కృష్ణ, కుసుమ జగదీష్, పాము శరత్, నల్ల మహాత్మ, గురిమిల్ల రాజు, కర్రు పావని, ఓరుగంటి కోటేశ్వర్ తదితర న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అమృత్ 2.0 పనులను వేగవంతం చేయాలి

సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ త్రిలేష్

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ త్రిలేష్ ఆదేశించారు. యాదగిరిగుట్ట పట్టణంలో జరుగుతున్న అమృత్ 2.0 పథకం పనులను నల్గొండ డీఈతో కలిసి గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, సమీక్షించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంకులు, తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. అనంతరం జేడీ త్రిలేష్ మాట్లాడుతూ... పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం అమృత్ 2.0 ద్వారా భారీ నిధులను వెచ్చిస్తోందని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండాలంటే ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ అనుసంధాన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణాల్లో జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదని, ప్రతి దశలో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. గడువులోగా మిగిలిన అన్ని పనులను ముగించి, త్వరితగతిన ట్రయల్ రన్ నిర్వహించి ప్రజలకు తాగునీటి సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్, నల్గొండ డీఈ మనోహర, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో అప్రమత్తంగా ఉండాలి

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్

మోటకొండూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందిని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఆదేశించారు. గురువారం మోటకొండూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులు, జనరల్ డైరీ, వివిధ రిజిస్టర్లు, పలు కేసుల ఫైళ్లతో పాటు పోలీస్ శాఖలోని వర్టికల్స్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, స్టేషన్ పరిసరాల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై వారి విధులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని, బాధితులకు పోలీస్ శాఖ అండగా నిలవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మోటకొండూర్ ఎస్ఐ కుమారస్వామి, ఏఎస్ఐ ప్రకాష్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గుట్ట నృసింహుని కి 44 రోజుల హుండీలతో రూ. 2.60 కోట్లు ఆదాయం

యాదగిరిగుట్ట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో గత 44 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపును అధికారులు పూర్తి చేశారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా స్వామివారికి మొత్తం ₹2,60,59,278 (రెండు కోట్ల అరవై లక్షల యాభై తొమ్మిది వేల రెండు వందల డెబ్భై ఎనిమిది రూపాయలు) నగదు ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి భవాని శంకర్ తెలిపారు.

బంగారం, వెండి కానుకలు: భక్తులు నగదుతో పాటు 65 గ్రాముల మిశ్రమ బంగారం, 2 కిలోల 650 గ్రాముల మిశ్రమ వెండిని కానుకలుగా సమర్పించారు.

లి విదేశీ కరెన్సీ: స్వామివారికి విదేశీ భక్తుల నుంచి పెద్ద ఎత్తున కరెన్సీ విరాళాలు వచ్చాయి. వీటిలో అమెరికాకు చెందిన 280 డాలర్లు, ఇంగ్లాండ్ 85 పౌండ్లు, కెనడా 20 డాలర్లు, సౌదీ అరేబియా 210, వియత్నాం 1,00,000, ఆస్ట్రేలియా 80, స్విస్ ఫ్రాంక్స్ 100, శ్రీలంక 100, నేపాల్ 65, దిర్హామ్స్ 50, యూరో 40, మలేషియా 11, సింగపూర్ 16, న్యూజిలాండ్ 5, ఖతార్ 1 వంటి విదేశీ నోట్లు హుండీ ద్వారా స్వామివారికి సమకూరాయి.



గుట్టలో ఘనంగా నిత్య పూజలు.

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని భక్తులు దర్శించుకొని మొక్కు పూజలు ఘనంగా నిర్వహించారు వివిధ పూజల ద్వారా స్వామివారికి భారీగా ఆదాయం సమకూరింది. యాదగిరిగుట్టలో ఒక్కరోజే స్వామివారికి రూ. 20.57 లక్షల ఆదాయం.. 971 మంది తలనీలాలు సమర్పించారు. ఒక్కరోజే వివిధ సేవల ద్వారా ఆలయానికి మొత్తం ₹20,57,347 (ఇరవై లక్షల యాభై ఏడు వేల మూడు వందల నలభై ఏడు రూపాయలు) ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు. అలాగే మొక్కులు చెల్లించుకునే క్రమంలో 971 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు.



ప్రధాన విభాగాల ఆదాయ వివరాలు:

- లీజుల ద్వారా అత్యధికంగా ₹8,05,053 ఆదాయం లభించింది.
- ప్రసాద విక్రయాల ద్వారా ₹5,13,720 సమకూరింది.
- కొండపైకి వాహనాల ప్రవేశం ద్వారా ₹1,54,500 వచ్చింది.
- వి.ఐ.పి దర్శనం (₹150) ద్వారా ₹1,09,050, ప్రధాన బుకింగ్ ద్వారా ₹76,450, బ్రేక్ దర్శనం ద్వారా ₹72,300 లభించాయి.
- సత్యనారాయణ వ్రతాల ద్వారా ₹65,000, యాదరుషి నిలయం ద్వారా ₹61,000, కళ్యాణకట్ట ద్వారా ₹48,550, సువర్ణ పుష్పార్చన ద్వారా ₹44,916 ఆదాయం సమకూరింది.
- శాశ్వత పూజలు (₹30,000), అన్నప్రసాదం (₹26,148), పాతగుట్ట (₹16,900) సహా ఇతర పూజా సేవల ద్వారా మిగతా ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈఓ భవాని శంకర్ తెలిపారు.




గుట్టలో లక్ష్మీనరసింహానికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట : శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను వివిధ పట్టువస్త్రాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చక స్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. సుగంధ పరిమళ పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమానుసారంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గుట్టలో ఘనంగా నిత్య పూజలు.

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని భక్తులు దర్శించుకొని మొక్కు పూజలు ఘనంగా నిర్వహించారు వివిధ పూజల ద్వారా స్వామివారికి భారీగా ఆదాయం సమకూరింది. యాదగిరిగుట్టలో ఒక్కరోజే స్వామివారికి రూ. 20.57 లక్షల ఆదాయం.. 971 మంది తలనీలాలు సమర్పించారు. ఒక్కరోజే వివిధ సేవల ద్వారా ఆలయానికి మొత్తం ₹20,57,347 (ఇరవై లక్షల యాభై ఏడు వేల మూడు వందల నలభై ఏడు రూపాయలు) ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు. అలాగే మొక్కులు చెల్లించుకునే క్రమంలో 971 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు.



ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో రిటైర్

23 ఏళ్ల ప్రస్థానానికి ముగింపు

పోర్చుగల్ జట్టుకు రొనాల్డో వీడ్కోలు

23 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు

234 మ్యాచ్‌లు.. 146 గోల్స్‌తో రికార్డు

కోచ్ జార్జ్ జీసస్‌తో విభేదాల నడుమ ప్రకటన

రొనాల్డో ఖాతాలో ఒక యూరో కప్, రెండు నేషన్స్ లీగ్ టైటిళ్లు

అందని కలగా మిగిలిపోయిన సాకర్ వరల్డ్ కప్



ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో సంచలన నిర్ణయం తీసుకున్నాడు. పోర్చుగల్ జాతీయ జట్టు తరఫున తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించాడు. 23 ఏళ్ల పాటు సాగిన ప్రస్థానానికి వీడ్కోలు చెబుతూ సోషల్ మీడియాలో భావోద్వేగ వీడియోను పంచుకున్నాడు. పోర్చుగల్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా, అత్యధిక గోల్స్ చేసిన ఫుట్‌బాలర్‌గా రికార్డులు సృష్టించిన 41 ఏళ్ల రొనాల్డో.. ఇకపై జాతీయ జట్టు తరఫున మైదానంలో కనిపించడు. తనకు ఎంతో ప్రత్యేకమైన 7వ నంబర్ జెర్సీని తర్వాతి తరం ఆటగాడికి అందించనున్నట్లు వెల్లడించాడు. "జాతీయ జట్టు తరఫున మైదానంలో నా ప్రయాణం నేటితో ముగుస్తోంది. నేను సాగించిన ప్రస్థానం పట్ల గర్వంగా ఉంది. పోర్చుగల్ కోసం నా శక్తినంతా ధారపోశాననే సంతృప్తితో వీడ్కోలు చెబుతున్నా" అని రొనాల్డో తన సందేశంలో పేర్కొన్నాడు. అభిమానులు, కుటుంబ సభ్యులు, తనతో కలిసి ఆడిన సహచరులకు కృతజ్ఞతలు తెలిపాడు. 7వ నంబర్ జెర్సీ ఇక మరొకరి సొంతమైనా.. దానిని ధరించిన గర్వం తనకు ఎప్పటికీ ఉంటుందని చెప్పాడు.

కోచ్‌తో వివాదం.. చివరి రోజుల్లో కలకలం

రొనాల్డో అంతర్జాతీయ కెరీర్ ముగింపు ప్రకటనకు ముందు పోర్చుగల్ జట్టులో పరిణామాలు చర్చనీయాంశమయ్యాయి. ప్రధాన కోచ్ జార్జ్ జీసస్‌తో అతడికి విభేదాలు తలెత్తాయి. సెప్టెంబర్ 27న నార్వేతో జరిగిన నేషన్స్ లీగ్ మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1తో గెలిచినా.. రొనాల్డోకు ఒక్క నిమిషం కూడా ఆడే అవకాశం దక్కలేదు. ఫిట్‌నెస్ నిర్వహణలో భాగంగా తనకు విశ్రాంతి ఇస్తారని తొలుత చెప్పారని, ఆ తర్వాత నార్వేతో మ్యాచ్‌లో సుమారు 30 నిమిషాలు ఆడిస్తానని కోచ్ హామీ ఇచ్చాడని రొనాల్డో వెల్లడించాడు. విరామ సమయంలో వార్మప్ చేసినా మైదానంలోకి దిగే అవకాశం రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశాడు. మ్యాచ్ తర్వాత మీడియాకు పరిస్థితిని వివరిస్తానని కోచ్ తనతో అంగీకరించిన విషయానికి భిన్నంగా మాట్లాడాడని రొనాల్డో ఆరోపించాడు. అయితే జట్టును ఎంపిక చేసే బాధ్యత తనదేనని జీసస్ స్పష్టం చేశారు. ఈ వివాదం నేపథ్యంలో డెన్మార్క్‌తో మ్యాచ్‌కు ముందు కోపెన్‌హేగన్‌లోని జట్టు శిబిరం నుంచి రొనాల్డో వెళ్లిపోయాడు. దీనిపై పోర్చుగల్‌లో విమర్శలు వెల్లువెత్తాయి. అనంతరం తన నిర్ణయం తప్పేనని అంగీకరించిన రొనాల్డో.. సహచర ఆటగాళ్లు, అభిమానులకు క్షమాపణలు చెప్పాడు. ఈ ఘటనపై పోర్చుగల్ ఫుట్‌బాల్ సమాఖ్య అతడికి 30 రోజుల సస్పెన్షన్‌తో పాటు 255 యూరోల జరిమానా విధించింది. అయితే ఆ శిక్షను వెనక్కి తీసుకోవడంతో తర్వాతి మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉండే అవకాశం లభించింది. 2026 ప్రపంచకప్ తర్వాత అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకాలని గతంలో భావించిన రొనాల్డో.. సమాఖ్య అధ్యక్షుడు పెడ్రో ప్రోయెంకా సూచనతో ఆ నిర్ణయాన్ని పునరాలోచించినట్లు కథనంలో పేర్కొన్నారు.

రొనాల్డో రికార్డుల ప్రస్థానం

2003 ఆగస్టులో కజకిస్థాన్‌తో మ్యాచ్ ద్వారా పోర్చుగల్ జట్టులోకి అడుగుపెట్టిన రొనాల్డో.. ఆ మరుసటి ఏడాదే యూరో 2004 ఫైనల్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో గ్రీస్ చేతిలో పోర్చుగల్ ఓడిపోయినా.. జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. 2006 ప్రపంచకప్, 2012 యూరో కప్‌లలో పోర్చుగల్ సెమీఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. 2016 యూరో కప్ ఫైనల్‌లో ఫ్రాన్స్‌తో తలపడిన సమయంలో గాయంతో తొలి అర్ధభాగంలోనే రొనాల్డో మైదానం వీడాడు. అయినప్పటికీ పక్కన నిలబడి సహచరులను ఉత్సాహపరిచాడు. అదనపు సమయంలో ఎడెర్ చేసిన గోల్‌తో పోర్చుగల్ తొలి యూరో కప్ టైటిల్‌ను అందుకుంది. 2019లో స్విట్జర్లాండ్‌పై సెమీఫైనల్‌లో హ్యాట్రిక్ సాధించి నేషన్స్ లీగ్ తొలి టైటిల్ గెలవడంలోనూ రొనాల్డో కీలక పాత్ర పోషించాడు. 2025లో స్పెయిన్‌తో ఫైనల్‌లోనూ గోల్ చేసి రెండోసారి నేషన్స్ లీగ్ విజేతగా నిలిచిన జట్టులో భాగమయ్యాడు. పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ చేసిన రొనాల్డో.. పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ఈ రెండు విభాగాల్లోనూ ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు. 2026 ప్రపంచకప్‌లో ఆరు వేర్వేరు టోర్నీల్లో గోల్స్ చేసిన తొలి ఆటగాడిగా మరో ఘనత సాధించాడు. యూరో కప్ చరిత్రలో అత్యధికంగా 14 గోల్స్, 30 మ్యాచ్‌లు ఆడిన రికార్డులు కూడా అతడి పేరిటే ఉన్నాయి.

అందని ప్రపంచకప్ కల

రొనాల్డో కెరీర్‌లో ఎన్నో విజయాలు ఉన్నా.. ఫిఫా ప్రపంచకప్ మాత్రం అందని కలగానే మిగిలిపోయింది. 2006లో పోర్చుగల్ సెమీఫైనల్ చేరడమే అతడి కెరీర్‌లో ఆ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన. 2022లో మొరాకో చేతిలో క్వార్టర్ ఫైనల్లో ఓటమి, 2026లో స్పెయిన్ చేతిలో ప్రిక్వార్టర్ ఫైనల్లో పరాజయం అతడికి చేదు జ్ఞాపకాలుగా మిగిలాయి. అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికినా.. క్లబ్ ఫుట్‌బాల్‌లో రొనాల్డో ప్రయాణం కొనసాగనుంది. అల్ నసర్ తరఫున ఆడుతున్న అతడు కెరీర్‌లో 1,000 గోల్స్ మైలురాయికి చేరువలో ఉన్నాడు. తాజా లెక్కల ప్రకారం అతడి మొత్తం గోల్స్ సంఖ్య 979. పోర్చుగల్ జట్టుకు 234 మ్యాచ్‌లు, 146 గోల్స్, ఒక యూరో కప్, రెండు నేషన్స్ లీగ్ టైటిళ్లు అందించిన రొనాల్డో వారసత్వాన్ని మరో ఆటగాడు భర్తీ చేయడం అంత సులభం కాదు.

సెంచరీలు కాదు.. 43 పరుగుల ఇన్నింగ్సే బెస్ట్

కోహ్లీ ఎంపిక వెనుక ఆసక్తికర కారణం




వన్డే క్రికెట్‌లో విరాట్ కోహ్లీ సాధించిన సెంచరీలు ఎన్నో. 183, 133 నాటౌట్ వంటి అద్భుత ఇన్నింగ్స్‌లు అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. అయితే తన కెరీర్‌లో అత్యుత్తమ వన్డే ఇన్నింగ్స్ ఏదంటే మాత్రం కోహ్లీ అనూహ్యమైన సమాధానం చెప్పాడు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై చేసిన 43 పరుగుల ఇన్నింగ్సే తనకు అత్యంత ప్రత్యేకమని వెల్లడించాడు. పుట్టినరోజు జరుపుకొంటున్న కోహ్లీ.. ఈ సందర్భంగా స్టార్ స్పోర్ట్స్ రూపొందించిన ప్రత్యేక వీడియోలో పాల్గొన్నాడు. తన కెరీర్‌లోని కొన్ని కీలక ఇన్నింగ్స్‌లను జతచేసి, వాటిలో ఏది అత్యుత్తమమో ఎంచుకోవాలని నిర్వాహకులు కోరారు. తొలుత 2011 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో శ్రీలంకపై చేసిన 35 పరుగుల ఇన్నింగ్స్‌ను ఎంపిక చేశాడు. హోబర్ట్‌లో శ్రీలంకపై 2012లో చేసిన అజేయ 133 పరుగులు, 2023 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై చేసిన 85 పరుగుల కంటే దానికే ప్రాధాన్యమిచ్చాడు. ఇంగ్లండ్‌పై 2017లో చేసిన 122, దక్షిణాఫ్రికాపై 2018లో సాధించిన అజేయ 160 పరుగుల ఇన్నింగ్స్‌లనూ పక్కనపెట్టాడు. అయితే చివరకు 2013 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై చేసిన 43 పరుగుల ఇన్నింగ్స్ ముందు వాటన్నింటినీ వెనక్కి నెట్టాడు. వర్షం కారణంగా 20 ఓవర్లకు కుదించిన ఆ మ్యాచ్‌లో భారత్ 66 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో కోహ్లీ 34 బంతుల్లో 43 పరుగులు చేశాడు. రవీంద్ర జడేజాతో కలిసి ఆరో వికెట్‌కు 47 పరుగులు జోడించాడు. జడేజా 33 పరుగులతో రాణించడంతో భారత్ 129 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్‌ను 124 పరుగులకే పరిమితం చేసి ఐదు పరుగుల తేడాతో విజయం సాధించింది. పాకిస్థాన్‌పై 2012 ఆసియా కప్‌లో చేసిన 183, దక్షిణాఫ్రికాపై 2015లో సాధించిన 138, 2015 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై చేసిన 107 పరుగుల ఇన్నింగ్స్‌లను కూడా కాదని కోహ్లీ ఎంచుకున్న ఇన్నింగ్స్ ఇది. భారీ వ్యక్తిగత స్కోర్ల కంటే జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు చేసిన కీలక పరుగులకే కోహ్లీ ఎక్కువ విలువ ఇస్తున్నాడని దీని ద్వారా స్పష్టమవుతోంది.

సీఎస్‌కే, ఎస్ఆర్‌హెచ్ మధ్య మెగా డీల్

సగం ధరకే లివింగ్‌స్టోన్ చెన్నై గూటికి!

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ట్రేడింగ్ విండోలో ఒక భారీ ఒప్పందం కుదిరింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఫ్రాంచైజీల మధ్య పలువురు కీలక ఆటగాళ్లు చేతులు మారారు. ఈ మెగా ట్రేడ్‌లో భాగంగా, ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ చెన్నై జట్టులోకి రాగా, భారత లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఖలీల్ అహ్మద్, ఆనీస్ పేసర్ నాథన్ ఎల్లిస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ గూటికి చేరారు. ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన అంశం లివింగ్‌స్టోన్ బదిలీ. గతంలో ఎస్ఆర్‌హెచ్ అతడిని రూ.13 కోట్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు చెన్నై సగాని కన్నా తక్కువ ధరకు, అంటే కేవలం రూ.6 కోట్లకు సొంతం చేసుకుంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో లివింగ్‌స్టోన్ కేవలం రెండు మ్యాచ్‌లే ఆడి 15 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. ఇక, గాయం కారణంగా గత సీజన్‌కు దూరమైన జాక్ ఎడ్వర్డ్స్‌ను సీఎస్‌కే అతని ప్రస్తుత ఫీజు రూ.3 కోట్లతో జట్టులోకి తీసుకుంది. ఈ ఇద్దరు ఓవర్సీస్ ఆల్‌రౌండర్ల చేరికతో చెన్నై జట్టు సమతూకం పెంచుకుంది. మరోవైపు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకుంది. గతంలో 2018 నుంచి 2021 వరకు ఎస్ఆర్‌హెచ్‌కే ప్రాతినిధ్యం వహించిన ఖలీల్ అహ్మద్, తన ప్రస్తుత ఫీజు రూ.4.8 కోట్లతో తిరిగి సొంత జట్టులోకి వచ్చాడు. ఐపీఎల్ 2025లో సీఎస్‌కే తరఫున 14 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసిన ఖలీల్, 2026లో గాయం కారణంగా ఐదు మ్యాచ్‌లకే పరిమితమయ్యాడు. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా పేరున్న నాథన్ ఎల్లిస్ రూ.2 కోట్ల ఫీజుతో హైదరాబాద్ జట్టులోకి చేరాడు. అతను కూడా గత సీజన్‌లో గాయం కారణంగా ఆడలేదు. ప్రస్తుత ట్రేడింగ్ విండోలో ఇది మూడో పెద్ద డీల్. ఇప్పటికే లక్నో నుంచి రిషభ్ పంత్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ తిరిగి తీసుకోగా, కుల్దీప్ యాదవ్‌ను వదులుకుంది. అలాగే, ఢిల్లీ నుంచి టి. నటరాజన్ తిరిగి ఎస్ఆర్‌హెచ్‌లోకి రాగా, బదులుగా జీషాన్ అన్సారీ ఢిల్లీకి మారిన సంగతి తెలిసిందే.



ఏపీ క్రికెట్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్

భారత్-శ్రీలంక తొలి వన్డే ఢిల్లీ నుంచి విశాఖకు మార్పు

ఆంధ్రప్రదేశ్‌లోని క్రికెట్ ప్రేమికులకు ఇది శుభవార్త. భారత్, శ్రీలంక మధ్య జరగాల్సిన తొలి వన్డే మ్యాచ్ వేదికను ఢిల్లీ నుంచి విశాఖపట్నానికి మారుస్తున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారికంగా ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 13న జరగాల్సిన ఈ మ్యాచ్ వేదికలో మాత్రమే మార్పు చేసినట్లు వెల్లడించింది. తేదీ యథాతథంగా ఉంటుందని స్పష్టం చేసింది. ఢిల్లీలో డిసెంబర్ నెలలో ఉండే ప్రతికూల వాతావరణ పరిస్థితులు, అలాగే స్టేడియంలో చేపట్టాల్సిన పునరుద్ధరణ పనులను దృష్టిలో ఉంచుకొని మ్యాచ్ వేదికను మార్చాలని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) బీసీసీఐకి విజ్ఞప్తి చేసింది. ఈ అభ్యర్థనను పరిశీలించిన బీసీసీఐ, తొలి వన్డేను విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియానికి తరలించాలని నిర్ణయించింది. దీంతో డిసెంబర్ 13న జరగనున్న తొలి వన్డేకు వైజాగ్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ పర్యటనలో భాగంగా శ్రీలంక జట్టు భారత గడ్డపై మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొంటుంది. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేశారు.



శ్రీలంక భారత పర్యటన 2026 - పూర్తి షెడ్యూల్

తొలి వన్డే: డిసెంబర్ 13, ఆదివారం (మధ్యాహ్నం 2:00) – విశాఖపట్నం

రెండో వన్డే: డిసెంబర్ 16, బుధవారం (మధ్యాహ్నం 2:00) – బెంగళూరు

మూడో వన్డే: డిసెంబర్ 19, శనివారం (మధ్యాహ్నం 2:00) – అహ్మదాబాద్

టీ20 సిరీస్

తొలి టీ20: డిసెంబర్ 22, మంగళవారం (రాత్రి 7:00) – రాజ్‌కోట్

రెండో టీ20: డిసెంబర్ 24, గురువారం (రాత్రి 7:00) – కటక్

మూడో టీ20: డిసెంబర్ 27, ఆదివారం (రాత్రి 7:00) – పు

దెబ్బలు తిన్న హీరోయిన్

తెలుగు సినిమా ఇండస్ట్రీలో అందమైన హీరోయిన్లలో కాజల్ అగర్వాల్ ఒకరు. తన నటనతో.. అందంతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారు. కెరీర్ ప్రారంభంలో చిన్న సినిమాలు చేసిన ఈ హీరోయిన్.. ఆ తర్వాత స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన లక్ష్మీ కళ్యాణం సినిమాతో కాజల్ తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఈ సినిమాకు తేజ దర్శకత్వం వహించారు. ఆ తర్వాత వచ్చిన చందమామ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఇక రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన మగధీర సినిమాతో కాజల్ కెరీర్ ఒక్కసారిగా మారిపోయింది. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో ఆమెకు స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత తెలుగుతో పాటు తమిళం, హిందీ సినిమాల్లో కూడా నటించి తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. పెళ్లి చేసుకుని ఒక బిడ్డకు తల్లి అయిన తర్వాత కూడా కాజల్ సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. తన సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక తాజాగా ఒక ఇంటర్వ్యూలో కాజల్ చెప్పిన విషయం ఆసక్తికరంగా మారింది. తన తల్లిదండ్రులకు తన కెరీర్‌లో ఏ సినిమా అంటే చాలా ఇష్టం అని ఒక బాలీవుడ్ మీడియా ఇంటర్వ్యూలో.. యాంకర్ అడిగారు. దీనికి కాజల్ చెప్పిన సమాధానం అందరినీ ఆశ్చర్యపరిచింది.

తన తల్లిదండ్రులకు లక్ష్మీ కళ్యాణం సినిమా అంటే చాలా ఇష్టమని కాజల్ తెలిపారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయాన్ని అందుకోకపోయినా, కాజల్ తన హిట్ సినిమాలు అన్ని పక్కన పెట్టి.. ఈ సినిమా పేరు చెప్పడం అందరిని ఆశ్చర్యపరిచింది.. అయితే దీనికి కారణం కూడా కాజల్ వివరించారు. ఆ సమయంలో తనకు నటన గురించి పెద్దగా తెలియదని, ఎలాంటి నటనలో ప్రత్యేక శిక్షణ తీసుకోలేదని చెప్పారు. సినిమాలు చేస్తూ నటన నేర్చుకున్నానని తెలిపారు.



విడుదలకు ముందే కేక పెట్టిస్తున్న కాకా..!

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న కాకా సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన వాల్తేరు వీరయ్ భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు మరోసారి ఈ హిట్ కాంబో ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా సినిమా విడుదలకు ముందే జరుగుతున్న బిజినెస్ హాట్ టాపిక్‌గా మారాయి. చిరంజీవి ఈ ఏడాది సంక్రాంతికి మన శంకరవరప్రసాద్ గారు సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఈ సినిమా తర్వాత ఆయన చేస్తున్న కాకాపై భారీ అంచనాలు ఉన్నాయి. బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో కాకా సినిమాకు సంబంధించి తాజాగా వినిపిస్తున్న బిజినెస్ వార్తలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల థియేట్రికల్ హక్కుల కోసం నిర్మాతలు ఏకంగా రూ. 70 కోట్లు కోట్ చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. చిరంజీవికి ఉన్న క్రేజ్, బాబీకి ఉన్న హిట్ ట్రాక్ రికార్డు కారణంగానే ఈ స్థాయిలో బిజినెస్ అంచనాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరి ఈ భారీ మొత్తాన్ని పెట్టి తెలుగు రాష్ట్రాల హక్కులను ఎవరు దక్కించుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాలో మలయాళ నటి అనస్వర రాజన్ చిరంజీవి కుమార్తె అమ్ములు పాత్రలో కనిపించనున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్, నివేదా పేతురాజ్ కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కాకా సినిమా 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా విడుదల కావాల్సి ఉంది. అయితే చిరంజీవి మరో సినిమా విశ్వంభర కూడా సంక్రాంతి బరిలోకి వచ్చే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అలా జరిగితే కాకాను కాస్త ఆలస్యంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక పాన్ ఇండియా లెవెల్ లో విడుదల అయితే ఈ సినిమా బిజినెస్ మరింత జరగచ్చేమో వేచి చూడాలి.





సౌత్ నటినినే వివక్ష చూపారు

కరణ్ జోహార్‌పై రెజీనా సంచలన ఆరోపణలు

ప్రముఖ నటి రెజీనా కసాండ్రా బాలీవుడ్‌పై, ముఖ్యంగా దర్శక నిర్మాత కరణ్ జోహార్‌కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తాను నటించిన 'కేసరి చాప్టర్ 2' సినిమా ప్రమోషన్లలో తనను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టారని, దక్షిణాది నటిని కావడం వల్లే ఈ వివక్ష ఎదురైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె వ్యాఖ్యలు భారత సినీ పరిశ్రమలో 'నార్త్ వర్సెస్ సౌత్' చర్చను మరోసారి రాజేశాయి. అక్షయ్ కుమార్ హీరోగా నటించిన 'కేసరి 2'లో ఆయన భార్యగా కీలక పాత్ర పోషించినప్పటికీ, ప్రమోషన్ల సమయంలో తన పేరును తొలగించారని రెజీనా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. "నాపై చిత్రీకరించిన పాటను విడుదల చేసి, సోషల్ మీడియాలో కనీసం ట్యాగ్ కూడా చేయలేదు. నేను సౌత్ ఇండియన్ నటిని కావడం వల్లే ఇలా చేశారా?" అని ఆమె ప్రశ్నించారు.ఇటీవల సౌత్ సినిమాలపై జాన్వీ కపూర్, రాధికా ఆప్టే చేసిన వ్యాఖ్యలపైనా ఆమె తీవ్రంగా స్పందించారు. ఉత్తరాది నటులు ఇలా బహిరంగంగా మాట్లాడటం వల్ల అనవసరంగా నార్త్-సౌత్ విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. "ఒకవేళ సౌత్ సినిమాలలో పనిచేయడం ఇబ్బందిగా అనిపిస్తే, ఆ ప్రాజెక్ట్‌ల నుంచి బయటకు వెళ్లిపోవాలి. అంతేకానీ తర్వాత దాని గురించి మాట్లాడటం సరికాదు" అని ఆమె సూటిగా అన్నారు. బాలీవుడ్‌లో తనకు ఎదురైన అనుభవాన్ని, తోటి నటుల వ్యాఖ్యలను ముడిపెడుతూ రెజీనా చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే, రెజీనా ఆరోపణలపై ఇప్పటివరకు ధర్మ ప్రొడక్షన్స్ గానీ, కరణ్ జోహార్ గానీ స్పందించలేదు.

కీర్తి సురేష్.. మరోసారి లెక్క తప్పిందా..

కీర్తి సురేష్‌కు తెలుగుతో పాటు తమిళంలోనూ మంచి గుర్తింపు ఉంది. 'మహానటి'తో జాతీయ అవార్డు అందుకున్న ఆమె, హిందీలోనూ సత్తా చాటాలని చూస్తోంది. కానీ అక్కడ మాత్రం పరిస్థితులు అనుకున్నట్లు కలిసి రావడం లేదు. వరుణ్ ధావన్‌తో చేసిన 'బేబీ జాన్' నిరాశపరచగా, ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చిన 'అక్క' కూడా మిక్స్‌డ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. దీంతో బాలీవుడ్‌లో కీర్తికి సరైన బ్రేక్ ఇంకా దక్కలేదనే చెప్పాలి. 2024లో విడుదలైన 'బేబీ జాన్'తో కీర్తి హిందీ సినిమాల్లోకి అడుగుపెట్టారు. తమిళంలో విజయ్ నటించిన 'తెరి'కి రీమేక్‌గా వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ పరాజయం అందుకుంది. వరుణ్ ధావన్ లాంటి హీరో పక్కన నటించినా ఆ విజయం కీర్తికి ఉపయోగపడలేదు. దీంతో హిందీలో తొలి సినిమాతోనే మంచి మార్కెట్ సంపాదించుకోవాలనే అవకాశం చేజారింది. నిజానికి 'అక్క'నే తన మొదటి హిందీ ప్రాజెక్ట్‌గా విడుదల చేయాలని కీర్తి భావించారట. ఈ సిరీస్ కథ నచ్చడంతో ఇతర ప్రాజెక్టులకంటే ముందే ఒప్పుకున్నారు. కానీ నిర్మాణం, విడుదల ఆలస్యం కావడంతో 'బేబీ జాన్' ముందుగా ప్రేక్షకుల దగ్గరకు వచ్చింది. లేటెస్ట్ గా ఈ విషయాన్ని ప్రమోషన్లలో కీర్తి స్వయంగా వెల్లడించారు. ఇక 'అక్క'లో మాత్రం పూర్తిగా భిన్నమైన పాత్ర. ఎనభై దశకంలో మహిళల ఆధిపత్యంలో నడిచే ప్రాంతానికి నాయకురాలైన భవానిగా కనిపించారు. రాధికా ఆప్టేతో పోటీపడే పాత్రలో కీర్తి నటనకు మంచి ప్రశంసలు వచ్చాయి. ముఖ్యంగా ఆమె స్క్రీన్ ప్రెజెన్స్‌ను మెచ్చుకున్నారు. కానీ సిరీస్ కథనం విషయంలో రివ్యూలు భిన్నంగా ఉండటంతో ఆశించిన స్థాయిలో కంప్లీట్ పాజిటివ్ టాక్ రాలేదు. అయితే హిందీలో కీర్తి ఎంచుకుంటున్న కథలను చూస్తే ఒక విషయం అర్థమవుతోంది. 'బేబీ జాన్'లో కమర్షియల్ హీరోయిన్‌గా కనిపిస్తే, 'అక్క'లో కథను నడిపించే పాత్ర చేసింది. రెండు వేర్వేరు ప్రయత్నాలు చేసినా ఆమెకు తెలుగులో 'మహానటి', 'దసరా' వంటి సినిమాలతో వచ్చిన స్థాయి గుర్తింపు హిందీలో ఇంకా దక్కలేదు.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA